RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake
Printing of
Daily News Papers

హైదరాబాద్ 17 జూన్ 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:16

# విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా..

**సమగ్ర కార్యాచరణకు అధికారుల ప్రత్యేక కమిటీ**

**రైతు వేదికల్లో విత్తనాలు, ఎరువుల పంపిణీ ..ఎరువులపైన కేంద్రం పైన ఎప్పటికప్పుడు ఒత్తిడి..**

**ఎంపీలతో కలిసి కేంద్రం వద్దకు మంత్రుల టీం వ్యవసాయ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి**



హైదరాబాద్.. రైతులకు విత్తనాల సరఫరా నుంచి పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్ల వరకు సమగ్ర ప్రణాళికతో పాటు నిర్దిష్ట కార్యాచరణ అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పంట వేసినప్పటి నుంచే రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, దిగుబడి అంచనాలు, ధాన్యం కొనుగోళ్ల వరకు ప్రతి దశలో వ్యవసాయ శాఖకు పూర్తి అవగాహన ఉండాలని స్పష్టం చేశారు.ఎంసి ఆర్ హెచ్ ఆర్ డి బోధి పెవిలియన్ లో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి , వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ధాన్యం కొనుగోళ్లలో ఇప్పటివరకు ఉన్న అనుభవాలు, రైతులు ఇబ్బంది పడకుండా చేపట్టాల్సిన చర్యలపై రైతు కమిషన్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, వ్యవసాయ నిపుణులు ఇచ్చిన సలహాలు, సూచనలను సమీక్ష సమావేశంలో చర్చించారు. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా ఇప్పుడే ఉన్నతాధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో పనిచేసే ఈ కమిటీలో వ్యవసాయ శాఖ డైరెక్టర్, సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్, ప్లానింగ్ విభాగం కార్యదర్శి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.విత్తనాల పంపిణీ మొదలు పంట వేసినప్పటి నుంచే అన్ని గ్రామాల్లో రైతుల వివరాల నమోదు, పంటల వివరాల రికార్డులు, పంట ఉత్పత్తుల అంచనాలు, ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంది. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంతో పాటు ఈ ప్రక్రియకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటుంది.ఏ రైతు ఏ పంట వేశాడు.. ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే వివరాలు కచ్చితంగా క్షేత్ర స్థాయి పరిశీలనతో నమోదు చేయాలని చెప్పారు.కనీస మద్దతు ధరలు, కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు, తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో 7 రకాల సన్న వడ్ల విత్తనాలను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. ఈ విత్తనాలను సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని చెప్పారు. రైతు వేదికల్లోనే సన్న వడ్ల విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సన్న వడ్లు పండించే రైతుల పూర్తి డేటా సేకరించాలని, ధాన్యం దిగుబడిపై వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. రైతు వేదికలను ఇకపై రైతులకు ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతులు అక్కడే తమ వివరాలు నమోదు చేసుకొని విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రతి రైతు వేదిక వద్ద వ్యవసాయ శాఖతో పాటు రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాల్లో వీటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలని ఆదేశించారు.వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలని చెప్పారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని విత్తనాల నుంచి కొనుగోళ్ల వరకు మొత్తం వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.భద్రాద్రి కొత్తగూడం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు అధ్యయనం చేయాలని, రైతులకు ఉపయోగంగా ఉంటే మరింత విస్తృతంగా వినియోగించుకోవాలని అన్నారు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ



హైదరాబాద్ మెట్రో ఫేజ్--2 విస్తరణకు అవసరమైన కేంద్రం అనుమతులతో పాటు ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదల మరింత జాప్యం చేయవద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ అంశంపై చర్చించేందుకు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖ రాశారు.

హైదరాబాద్ మెట్రో ఫేజ్--1 మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు ప్రయాణికులకు విశేష సేవలు అందిస్తోంది. పెరిగిన జనాభా, నగర విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్--2 ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. మొత్తం 7 కారిడార్లు, 122.9 కిలోమీటర్ల మార్గం, సుమారు ?38,595 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రతిపాదనలు ఇచ్చింది.

ఫేజ్--1 ప్రైవేటు నిర్వహణలో ఉండటం, ఫేజ్--2 వేరే సంస్థాగత విధానంలో అమలు చేయటంపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ తెలిపిన అభ్యంతరాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణాత్మకంగా స్వీకరించిందని సీఎం ఈ లేఖలో వివరించారు. మొత్తం మెట్రో వ్యవస్థ ఒకే నెట్ వర్క్?లో నడిచేందుకు వీలుగా ఫేజ్--1ను స్వాధీనం చేసుకునే అసాధారణ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఫేజ్--1 స్వాధీనం ప్రక్రియలో ఈక్విటీ కొనుగోలుకు రూ. 1,461.47 కోట్లు, ప్రాజెక్టు అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ. 13,538.53 కోట్లు కలిపి మొత్తం ?15,000 కోట్ల లావాదేవీలున్నాయి. ఈ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ పారదర్శకంగా నిర్వహించింది. ఈ కమిటీకి కేంద్ర ప్రభుత్వం తరఫున యూపీఎంఆర్‌సీఎల్ ఎండీ సుశీల్‌కుమార్‌ను సభ్యుడిగా నామినేట్ చేసిందని గుర్తుచేశారు.

ఐఆర్ఎఫ్‌సీ ప్రాజెక్టును పూర్తిగా పరిశీలించి, డ్యూ డిలిజెన్స్ పూర్తి చేసి రుణ మంజూరు ఒప్పందం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చింది. ఆర్?బీఐ ద్వారా డైరెక్ట్ డెబిట్‌కు అంగీకరించింది. ఐఆర్ఎఫ్‌సీ షరతుల ప్రకారం మొదటి విడత నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ?84.32 కోట్ల అప్‌ఫ్రంట్ ఫీజు చెల్లించింది. ఈక్విటీ ?1,461.47 కోట్లు ఇప్పటికే ఎస్క్రో ఖాతాలో జమ చేసింది. ఈ ఒప్పందాలన్నీ పూర్తయ్యాక, అన్ని షరతులు నెరవేర్చాక, 2026 జూన్ 15న రావాల్సిన మొదటి విడత రుణం విడుదల కాలేదని ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి దానం అడగటం లేదని సీఎం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఒప్పందం ప్రకారం ఐఆర్?ఎఫ్?సీ రుణాన్ని విడుదల చేయించాలని కోరుతున్నామని లేఖలో పేర్కొన్నారు.

తెలంగాణ నుంచి కేంద్రంలో సీనియర్ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఈ విషయంలో బాధ్యత తీసుకుని ఐఆర్ఎఫ్‌సీ ద్వారా మంజూరైన రుణం విడుదలయ్యేలా చూడాలని కోరారు. మెట్రో ఫేజ్--2ను కేంద్రం--రాష్ట్రం 50:50 జాయింట్ వెంచర్‌గా ఆమోదించాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందని సీఎం ఈ లేఖలో వివరించారు.

ఒకవేళ అనుమతులు ఆలస్యమైతే, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరులు, సంస్థాగత రుణాల ద్వారా ఫేజ్--2ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అందుకు అవసరమైన ముందస్తు అనుమతులను ఆలస్యం లేకుండా కేంద్రం నుంచి ఇప్పించాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం కిషన్‌రెడ్డిని కోరారు. సంబంధిత ఒప్పందాలు, ఆధార పత్రాలతో తాను అధికారులతో కలిసి ఆ సమావేశానికి హాజరై అన్ని వివరణలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

## చిన్న కాంట్రాక్టర్లకు 'ప్రజా ప్రభుత్వం' అండ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**దశలవారీగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేస్తామన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఈనెల 18న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిన సివిల్ కాంట్రాక్టర్లు**



రాష్ట్రంలోని చిన్న సివిల్ కాంట్రాక్టర్ల సమస్యల పట్ల ప్రజా ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో స్పందిస్తోందని, వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు స్పష్టం చేశారు. మంగళవారం ప్రజాభవన్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, సివిల్ కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేయగా, ఉపముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

చిన్న కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకునే ఆర్థిక శాఖ ప్రతినెలా నిరంతరాయంగా బిల్లులను చెల్లిస్తోందని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వారికి గుర్తుచేశారు. పెండింగ్ బకాయిల క్లియరెన్స్ కోసం ప్రభుత్వం ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని ఆయన వివరించారు. రాష్ట్రంలో చిన్న కాంట్రాక్టర్లకు దశలవారీగా పెండింగ్ బిల్లులన్నింటినీ పూర్తిగా చెల్లించి చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుంటామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.

అంతకుముందు, ఈ రోజు మధ్యాహ్నం కాంట్రాక్టర్ల ప్రతినిధులు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారితో చర్చలు జరిపారు. అనంతరం ప్రజాభవన్‌కు చేరుకుని, మంత్రి కోమటిరెడ్డితో జరిగిన చర్చల సారాంశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వివరించారు.

**'చలో హైదరాబాద్' వాయిదా: రవీందర్ రెడ్డి**

పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు ఇచ్చిన సానుకూల హామీతో తాము ఎంతో సంతృప్తి చెందామని, ఈ నెల 18న చేపట్టదలచిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని వాయిదా వేసుకుంటున్నట్లు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రవీందర్ రెడ్డి ప్రకటించారు. తమ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకు అసోసియేషన్ తరఫున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు వి. సత్యమూర్తి, మాజీ జాతీయ అధ్యక్షులు ఎస్.ఎన్. రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు డి.వి.ఎన్. రెడ్డి, సుగుణాకర్ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్, శ్యామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ.

వార్తా 2 లో



## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూలై 15 వరకు గడువు పొడిగింపు: హైకోర్టు

వార్తా 2 లో

ప్రజాబలం

17 జూన్ 2026 బుధవారం

# అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ.

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ.

## మంత్రి దనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 16** ములుగు మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్లు తదితర సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం రాష్ట్రంలో మహిళా అక్షరాస్యతకు కొత్త దిశానిర్దేశం చేస్తోందన్నారు. చదువురాని 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించామని, మొదటి విడతగా 6 లక్షల మందికి లిటరసీ పరీక్షలు నిర్వహించగా 83.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. ఇప్పుడు మరో 6 లక్షల మందిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని, భవిష్యత్తులో వారందరినీ పదో తరగతి పరీక్షలకు కూడా సిద్ధం చేసే కార్యాచరణ చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యత లేకుండా ప్రతి మహిళను అక్షరాస్యత వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా కష్టపడి చదవాలని, విద్యను కేవలం బట్టీ పట్టే విధంగా కాకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా అర్థం చేసుకుని నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు.

విద్యార్థులకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తే విద్యాభ్యాసంపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో విద్యా అభివృద్ధికి సహకరించే సంస్థలు మరింత ముందుకు రావాలని కోరుతూ, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీకి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,
వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీఐఈఓ వీరేంద్ర కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు చంద్రమౌళి, గణేష్, ఇతర సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ అఖండ కాంగ్రెస్..

ప్రధాని నరేంద్ర మోదీని, ఎన్డీయే ఎదుర్కోడానికి కాంగ్రెస్ భారీ స్కెచ్ వేస్తోంది. "అఖండ కాంగ్రెస్" దిశగానే అడుగులు వేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు పంపుతోంది. దీంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బయటకువెళ్లి, పార్టీలు పెట్టిన నేతలను సొంతగూటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. నేతలే కాదు, పార్టీలు సైతం విలీనానికి ప్రాథమిక దశలో సానుకూలంగా వుంటూ, చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో కలిపేసి, బలమైన శక్తిగా మారాలని ఆ ప్రాంతీయ పార్టీల నేతలు ఆలోచనలో వున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన చర్లు కూడా కొనసాగుతున్నాయి.మొదట ఈ విలీన ప్రతిపాదన తృణమూల్ కాంగ్రెస్ తో ప్రారంభమైంది.బెంగాల్ లో ఓటమి పాలైన తర్వాత, మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ లో తిరుగుబాటు బావుటా ఒక్క సారిగా పైకి వచ్చేసింది. ఏకంగా 20 మంది తాము ఎన్డీయేలో చేరేందుకు సిద్ధంగా వున్నామని ఎంపీలు ప్రకటించారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ లో వివాదం రేగింది. అలాగే అభిషేక్ బెనర్జీ చుట్టూ వివాదాలు చుట్టుకున్నాయి. అంతలోనే ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం కూడా జరిగింది. కొన్ని రోజులుగా ఇండియా కూటమి సమావేశాలకు మమతా దూరంగా వుంటూ వస్తున్నారు. ఎప్పుడైతే బెంగాల్ లో ఓడిపోయారో, ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు.ఇంతలోనే తృణమూల్ ను కాంగ్రెస్ లో కలిపేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ద్వారా ఇరు పార్టీలకు కూడా లాభం చేకూరుతుందని, ఇందుకు సోనియా, ప్రియాంక, రాహుల్ డీల్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. అంతలోనే సోనియా, మమత భేటీ కూడా జరిగింది. అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కోడానికి విలీనం చేయాలని భావించారు. గతంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకున్న వారంతా తిరిగి కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు జోరందుకున్నాయి. తాజాగా మరో వార్త కూడా హల్ చల్ చేస్తోంది. ఎన్సీపీ శరద్ పవార్ కూటమి కూడా కాంగ్రెస్ లో విలీనం అయ్యే అవకాశాలు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1999 లో కాంగ్రెస్ తో విభేదించి శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. సోనియా గాంధీ విదేశీయతను పవార్ ప్రశ్నించడంతో కాంగ్రెస్ బహిష్కరించింది. అలాగే సంగ్మా, తారీఖ్ అన్వర్ ను కూడా బహిష్కరించారు. వీరు ముగ్గురు కలిసి ఎన్సీపీని స్థాపించారు. టీఎంసీ మాదిరిగానే ఎన్సీపీలోనూ సంక్షోభం వుంది. అజిత్ పవార్ నాయకత్వంలో తిరుగుబాటు బావుటా ఎగరేశారు. దీంతో పార్టీ చీలిపోయింది. అయితే విలీన ప్రతిపాదన తమ వద్దకు రాలేదని సుప్రియా సూలే ప్రకటించారు. తాము కూడా అలా అనుకోవడం లేదని ప్రకటించారు. అలాగే మరి కొందరు కూడా కాంగ్రెస్ లో విలీనం అవ్వాలని కాంగ్రెస్ ప్రతిపాదనలు పంపింది. మరో వైపు న్ని రోజులుగా తృణమూల్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయిపోతోందన్న వార్తలు భారీగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు మమతా బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత సోనియాతో కూడా భేటీ అయ్యారు. దీంతో ఈ వార్తకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిపై కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. విలీనంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీని కలిసిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అది ఓ సాధారణ సమావేశమేనని స్పష్టం చేశారు. అసలు విలీనం గురించి చర్చలే జరగలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ కార్యాచరణను స్వతంత్రంగా కొనసాగిస్తోందని, టీఎంసీ కూడా తన పార్టీ విధానాల ప్రకారమే ముందుకు సాగుతోందని తెలిపారుకాంగ్రెస్ పార్టీలో వైసీపీ విలీనం అని కొందరు లేదు ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటారు అని మరి కొందరూ ఇలా రకరకాలైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఏపీలో పొలిటికల్ సన్నివేశం పూర్తిగా వేరు అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఆలోచనలు ఆయన మనస్తత్వం కాంగ్రెస్ ని జగన్ వీడిన సందర్భం ఇవన్నీ గుర్తు చేసుకుంటున్న వారు మాత్రం వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ లో విలీనం అయ్యే ప్రసక్తి లేదని అంటున్నారు. ఏపీలో ఈ రోజుకీ ఒంటరిగానే 40 శాతం ఓటు షేర్ ని సాధించి రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా ముద్ర ఉన్న వైసీపీకి కాంగ్రెస్ ని కౌగిలించుకోవడం అవసరమా అన్న ప్రశ్న కూడా రాజకీయ విశ్లేషకులు పలువురు వేస్తున్నారు.ఏపీ రాజకీయాలలో చూస్తే కనుక జగన్ ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడుతున్నారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సందర్భానుసారం విధానాల ప్రాతిపదికన అంటూ బిల్లులకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఆ విధంగా బీజేపీ పెద్దల వద్ద వైసీపీ గుడ్ విల్ సంపాదించుకుంది. అందుకే ఏపీలో టీడీపీ కూటమి మీద ధీటుగా పోరు చేస్తోంది అని అంటున్నారు. ఇక 2029 లో బీజేపీ టీడీపీ జనసేన కూటమిగా వచ్చినా కూడా వైసీపీ ఒంటరిగానే పోరుకు సిద్ధపడుతుందని చెబుతున్నారు. జనాలు నచ్చకపోతే కూటములను అయినా ఓడిస్తారు అన్నది దేశంలో చాలా ఎన్నికలు నిరూపించాయని కూడా వైసీపీ నేతలు అంటున్నారు. పైగా వైసీపీకి చెక్కు చెదరని ఓటు బ్యాంక్ 40 పర్సెంట్ ఉందని మరో పది శాతం తెచ్చుకుంటే అధికారం సొంతం అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. ఇక 2029 ఎన్నికలు చూస్తే కచ్చితంగా ఏ కూటములకు పూర్తి స్థాయిలో మెజారిటీ దక్కే సీన్ ఉండదని కూడా అంటున్నారు. బీజేపీని మూడు సార్లు చూసిన జనాలు ఈసారి పూర్తిగా ఏకపక్షంగా నెత్తికెత్తుకోరు అని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి బలం పెరిగినా కూడా మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా రాలేరని అంటున్నారు. దాంతో న్యూట్రల్ గా ఉండే పార్టీలకు ఆ ఎన్నికల తరువాత డిమాండ్ పెరుగుతుందని అపుడు వైసీపీ లాంటి పార్టీలే కీలకంగా జాతీయ స్థాయిలో మారుతాయని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు లెక్క వేస్తున్నారు. : ఈ క్రమంలో వైసీపీ అన్ని ఆప్షన్లూ ఓపెన్ గా ముందు పెట్టుకుంటుంది అని అంటున్నారు. అంతే తప్ప పొత్తుల పేరుతో ముందే కమిట్ అయిపోతే ఆ తరువాత కీలక నిర్ణయాలు తీసుకునే చాన్స్ కోల్పోతామని అంటున్నారు. ఏపీలో ఎలా చూసుకున్నా కాంగ్రెస్ అయితే ఈ రోజుకీ లేదని అంటున్నారు. మరో మూడేళ్ళలో కూడా అద్భుతాలు జరిగి కాంగ్రెస్ ఎదుగుతుందని కూడా ఎవరూ అనుకోవడం లేదని అంటున్నారు. అందువల్ల కాంగ్రెస్ తో పొత్తులు కానీ విలీనాలు కానీ వైసీపీకి అవసరం లేదని అంటున్నారు. పైగా జగన్ ని నాడు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అవమానించిందని అందుకే బయటకు రావాల్సి వచ్చిందని అంటున్నారు. ఇక జగన్ మీద నాడు సీబీఐ కేసులు పెట్టడంతోనే ఆయన పదహారు నెలల పాటు జైలు జీవితాన్ని అనుభవించాల్సి వచ్చిందని కూడా గుర్తు చేస్తున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీ కాంగ్రెస్ అనేది కలవడం అంటే అది ఇప్పట్లో జరిగేది కాదని అంటున్నారు ఒకవేళ 2029 ఎన్నికల తరువాత కాంగ్రెస్ నాయకత్వంలోని కూటమి అధికారానికి దగ్గరగా వస్తే కనుక అపుడు ఆలోచించే వీలు ఉందని కూడా అంటున్నారు. సో ప్రస్తుతానికి వస్తున్నవి అన్నీ ఊహాగానాలే అని కూడా అంటున్నారు.

## జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులకు జూలై 15 వరకు గడువు పొడిగింపు: హైకోర్టు



హైదరాబాద్, జూన్ 16: తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూలై 15 వరకు పొడిగిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జి.ఓ. ఎంఎస్ నెం.252 మరియు దానికి సంబంధించిన సవరణలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్‌తో పాటు మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల చెల్లుబాటును ప్రశ్నించిన ఫెడరేషన్, కేసు విచారణ పూర్తయ్యే వరకు అక్రిడిటేషన్‌కు సంబంధించిన సౌకర్యాలను కొనసాగించాలని కోర్టును కోరింది. పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు.

విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తరఫున స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ వైఖరిని కోర్టుకు వివరించారు. ప్రభుత్వ వాదనలు విన్న అనంతరం హైకోర్టు ప్రస్తుతం అమలులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో నెల రోజుల పాటు పొడిగించాలని నిర్ణయించింది. దీంతో ప్రస్తుతం ఉన్న అన్ని అక్రిడిటేషన్ కార్డులు 2026 జూలై 15 వరకు చెల్లుబాటులో ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో తెలంగాణ వ్యాప్తంగా అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావడంతో పాటు, అక్రిడిటేషన్‌కు అనుబంధంగా ఉన్న అన్ని సౌకర్యాలను కొనసాగించగలుగుతారు. వారి వృత్తిపరమైన బాధ్యతలకు ఆటంకం కలగకుండా ఈ ఉత్తర్వులు ఉపశమనం కల్పించాయి.

ఇక తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ ఒక ఇంటర్‌లాక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అక్రిడిటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులు, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్యతో పాటు వాటి తిరస్కరణకు గల కారణాలను కోర్టు ముందు ఉంచాలని ఆయన కోరారు. ఈ దరఖాస్తును తదుపరి విచారణలో పరిశీలించనుంది.

ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొంటూ, శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయపోరాటం కొనసాగుతుందని తెలిపారు.

కోర్టు తదుపరి విచారణను 2026 జూలై 22కు వాయిదా వేసింది. అప్పటి వరకు జర్నలిస్టులు ఎలాంటి అనిశ్చితి లేకుండా తమ విధులను నిర్వర్తించనున్నారు. ఈ పరిణామం రాష్ట్రవ్యాప్తంగా మీడియా వర్గాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. అక్రిడిటేషన్ విధానాలు, వాటి అమలుపై ఉన్న ఆందోళనలను కూడా ఇది మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది.

## ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు

### భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తాం: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

### డిఫెన్స్‌కు 1,500 ఎకరాలు.. రన్‌వే విస్తరణకు మరో 80 ఎకరాలు

### ఎంపీ, ఎమ్మెల్యే, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష

**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**ఆదిలాబాద్ జాయింట్ యూజర్ (డిఫెన్స్-సివిల్) ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో చేపడతామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్, బెంగళూరుకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు, రాష్ట్ర సివిల్ ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డితో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన, మైక్రో లెవెల్ సర్వే నిర్వహించి, రన్‌వే విస్తరణతో పాటు సాంకేతిక అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలను వేగవంతం చేశామన్నారు. ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, అదనంగా డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఎయిర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్) కోసం 1,500 ఎకరాలు, సివిల్ ఏవియేషన్ రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను కేటాయించేందుకు ప్రాథమిక ఆమోదం లభించిందని వివరించారు. జియో కోఆర్డినేట్ల ఆధారంగా భూసేకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని స్పష్టం చేసిన కలెక్టర్, సీఎంఓ కార్యాలయం, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు త్వరితగతిన భూసేకరణ పూర్తి చేసి రక్షణ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీకి భూములను అప్పగిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు సివిల్ ఏవియేషన్‌తో పాటు డిఫెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రావడం ప్రజలకు ఒక చారిత్రాత్మక అవకాశమని పేర్కొన్నారు.

ఢిల్లీ స్థాయిలో ఇప్పటికే చర్చలు:
ఎంపీ గోడం నగేష్

ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి సంబంధించిన లొకేషన్ల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని ఎంపీ గోడం నగేష్ తెలిపారు. గత మార్చిలో ఢిల్లీలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలతో ఈ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించామని, మే 15న కేంద్ర ఉన్నతస్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా నిర్వహించిందని గుర్తుచేశారు. రక్షణ శాఖ కోరిన 1,500 ఎకరాల భూమి సేకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సమన్వయంతో పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లా అధికారులతో కలిసి మ్యాప్‌ల ఆధారంగా మైక్రో లెవెల్ సమీక్ష నిర్వహించామని, ప్రాజెక్టు వేగవంతానికి నేటి సమావేశం కీలక ముందడుగు అని పేర్కొన్నారు.

దశాబ్దాల కల నెరవేరబోతోంది: ఎమ్మెల్యే పాయల శంకర్

జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ భూసేకరణపై నేటి సమావేశంతో స్పష్టత వచ్చిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. విమానాశ్రయ నిర్మాణానికి మొత్తం 1,840 ఎకరాలు అవసరమవుతాయని, ఇందులో 1,500 ఎకరాలను రక్షణ శాఖకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. ఇప్పటికే 360 ఎకరాలు రక్షణ శాఖ పరిధిలో ఉండగా, రన్‌వే విస్తరణ కోసం మరో 80 ఎకరాలను సేకరించాల్సి ఉందన్నారు.?గతంలో జారీ చేసిన 700 ఎకరాల జీవో ప్రకారం పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 800 ఎకరాల అనుమతుల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని చెప్పారు. తదుపరి విధానపరమైన నిర్ణయాల కోసం త్వరలో ఎంపీ నేతృత్వంలో ఢిల్లీలో ఉమ్మడి సమావేశం జరగనుందని, ఇందులో రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, రాజ్‌నాథ్ సింగ్‌లతో చర్చలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుతో ఆదిలాబాద్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోందని, జిల్లా అభివృద్ధికి కొత్త ద్వారాలు తెరుచుకోనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.?ఈ సమావేశం, క్షేత్రస్థాయి పరిశీలనలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్. చిత్రు, ఎస్. రాజేశ్వర్, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతాధికారులు జేపీ సబర్వాల్, ఎస్.జి. హెగ్డే, ఎస్.కె. రెడ్డి, ఆర్డీఓ జగదీశ్వర్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, తహశీల్దార్లు శ్రీనివాస్, గోవింద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం: కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 16:ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపికైన సందర్భంగా కేంద్రీకృత వంటగది నిర్మాణానికి గాను స్థల సేకరణ నిమిత్తం ఆలియాబాదు, కేశవరం లోని మూసిఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే విధంగా ఉండేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి గాను స్థల పరిశీలనకై శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలోని హాస్టల్స్ ను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ హాస్టల్స్ ఎప్పటి నుండి మూసి ఉన్నాయని, ఎంత స్థలం ఉందని బిసి వెల్ఫేర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టల్స్ స్థల వివరాల నివేదికను తనకు అందజేయాలని సంబంధిత ఎంఆర్ఓలకు సూచించారు. అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. విద్యార్థులు ఎంత మంది హాజరైనారని సంబంధితగ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికొత్త అడ్మిషన్లు అయ్యాయని అడిగారు. పిల్లలతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఆడుకోవడానికి పరికరాలు ఉన్నాయా, ఏమైనా కావాలా అని విద్యార్థులను అడుగగా, ఫుట్ బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ అందిస్తామన్నారు.

ఈ పర్యటనలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్ పేట్ ఎంఆర్ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ ఇద్రీస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు ఏజెన్సీ మన్న ట్రస్ట్ వారితో కలెక్టర్ మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకొని అవసరమైన సలహాలు సూచనలు అందజేసారు.

## వి. హనుమంతరావు కు శివసేన సుదర్శన్ జన్మదిన శుభాకాంక్షలు




హైద్రాబాద్ జూన్ 16 ;తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ), మాజీ మంత్రి ఎంపీ శ్రీ వి. హనుమంతరావు కు శివసేన ఉద్ధవ్ ఠాక్రే తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ సుదర్శన్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిరంతరం ప్రజల పక్షాన నిలిచే నిఖార్సైన నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు (బీసీ సంక్షేమ శాఖ), మాజీ మంత్రి ఎంపీ శ్రీ వి. హనుమంతరావు అని సుదర్శన్ కొనియాడారు.

సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజా సేవ పట్ల మీ అంకితభావం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. మీరు ఆయురారోగ్యాలతో, ఆనందంతో, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

# మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, ఆత్మనిర్భర్ భారత్ దిశగా చారిత్రాత్మక ప్రగతి

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్

యాదాద్రి భువనగిరి జూన్16: యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బూర నర్సయ్య గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశం సాధించిన అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక పురోగతి, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠ పెరిగిన విధానాన్ని వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం తర్వాత ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు మోదీ ప్రభుత్వం పరిష్కారం చూపిందన్నారు. "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" అనే సిద్ధాంతంతో సమాజంలోని ప్రతి వర్గాన్ని అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ దేశాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తోందని పేర్కొన్నారు.

పేదల సంక్షేమం కోసం అమలు చేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా కోట్లాది కుటుంబాలకు పక్కా గృహాలు అందించబడగా, ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా మహిళలకు పొగరహిత వంటగదులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. జన్ ధన్ యోజన ద్వారా కోట్లాది మంది బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారని, ఆర్థిక సమ్మిళితానికి ఇది ఒక విప్లవాత్మక అడుగుగా నిలిచిందన్నారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేరుతున్నాయని చెప్పారు.

ఆరోగ్య రంగంలో ఆయుష్మాన్ భారత్ -- ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన ద్వారా పేద కుటుంబాలకు భారీ ఆరోగ్య భద్రత కల్పించబడిందని, దేశవ్యాప్తంగా వేలాది ఆరోగ్య కేంద్రాలను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉచిత టీకా కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి కోట్లాది మంది ప్రాణాలను కాపాడిన ఘనత మోదీ ప్రభుత్వానిదేనని అన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని పేర్కొంటూ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారని, పీఎం ఫసల్ బీమా యోజన ద్వారా పంట నష్టాలకు బీమా రక్షణ కల్పిస్తున్నారని తెలిపారు. సోయిల్ హెల్త్ కార్డులు, సూక్ష్మ నీటిపారుదల పథకాలు, వ్యవసాయ మౌలిక వసతుల నిధి, ఈ-నామ్ (వ-చీూవీ) వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరిస్తున్నారని చెప్పారు.మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, బేటీ బచావో -- బేటీ పడావో, మాతృ వందన యోజన, సుకన్య సమృద్ధి యోజన, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహాయం వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక, విద్యా అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

పార్లమెంట్ మరియు శాసనసభల్లో




మహిళలకు రిజర్వేషన్లు కల్పించే నారీ శక్తి వందన్ చట్టం మహిళా సాధికారతకు చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు.

యువత కోసం స్టార్ట్ అప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, ముద్రా యోజన, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు అమలు చేసి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతంగా పెంచారని తెలిపారు. భారత్ నేడు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టమ్‌గా ఎదగడం యువత సామర్థ్యానికి, ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరు శ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మల్లేష్, కర్నాటి ధనంజయ్, పాశం భాస్కర్ ,రచ్చా శ్రీను చందా మహేందర్ , జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బుల్లెట్ మాధురి , ఇతర నాయకులు, మేధావులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు మరియు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

# డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం




హైదరాబాద్ జూన్ 16; డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది నిరుపేదలు, అవసరమైన ప్రజలు మరియు ప్రయాణికులకుజీ ఉచితంగా భోజనం అందజేశారు.

సమాజ సేవే లక్ష్యంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం గొప్ప సేవ అని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సమాజంలోని పేద మరియు అవసరమైన వర్గాలకు అండగా నిలవడం కోసం డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ తరచుగా అన్నదాన కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు మరియు ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన దాతలు, వాలంటీర్లు మరియు పాల్గొన్న అందరికీ సొసైటీ ఎక్సగ్యుటీ మెంబర్ జి.మాధవి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాఘవేంద్ర గ్రాండ్ కళ్యాణ మండపంలో అట్టహాసంగా రాష్ట్ర ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సంబరాలు

### విజయోత్సవ సంబరాలను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు నియోజకవర్గం లోని నలుమూలల నుంచి భారీగా విచ్చేసిన ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు... భారీగా తరలివచ్చిన మహిళలు.

రెండేళ్లలో ప్రజలకు కల్పించిన నమ్మకం, చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించేలా విజయోత్సవాలు

బద్వేలు విజయోత్సవ సంబరాలకు హాజరైన కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరి ప్రసాద్,బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నారిశెట్టి సుప్రజ, టిడిపి నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, అధికారులు, ప్రజాప్రతినిధులు.? రాఘవేంద్ర గ్రాండ్ కళ్యాణ మండపం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించిన కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్. ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందిన ప్రజల విజయగాథలను ప్రతిబింబించిన వివిధ శాఖల ప్రత్యేక స్టాళు ..నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులకు వివరించిన బద్వేల్ ఆర్డీవో చంద్రమోహన్, ఆయా శాఖల అధికారులు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమం రెండు చక్రాలుగా ముందుకు సాగుతున్న రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రతీకగా విజయోత్సవ వేడుకలు ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరి ప్రసాద్ , బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, బి.కోడూరు మండలం టీడీపీ అధ్యక్షులు రామచంద్రా రెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ ,బీజేపీ జిల్లా కార్యదర్శి కేవీ రమణ,ఆర్య వైశ్య కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకట సుబ్బయ్య, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ వేణుగోపాల్, సీమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ జహంగీర్ భాష, బద్వేలు నియోజకవర్గం నాయకులు చెరుకూరి రవికుమార్,పామూరి బాలిరెడ్డి,కర్నాటి వెంకట రెడ్డి, బాదిరెడ్డి వీరారెడ్డి,ఇమామ్ హుస్సేన్, కొంకుల రాంబాబు, మాచుపల్లి లక్ష్మి దేవి, చెరుకూరి చెంద్రాయుడు, ఓ. రమణారెడ్డి, జనసేన నాయకులు ఈశ్వర్ రెడ్డి, సింగం శెట్టి వెంకట సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులు



జహీరాబాద్, జూన్ 16 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నికైన నరేష్ గౌడ్, ఉగ్గేల్లి రాములు, భాస్కర్ రెడ్డి, స్వర్ణ మల్లన్న, ముజఫర్ హుస్సేన్, పవన్ కుమార్, ఉదయ్ శంకర్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేరేలా కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శాయశక్తుల పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారికి పదవిని కట్టబెట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మాజీమంత్రి చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్, గిరిధర్ రెడ్డి, ఉజ్వల్ రెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మందుబాబులకు విజయ్ సర్కార్ బంపర్ ఆఫర్

**-ఖాళీ మద్యం సీసా ఇస్తే చాలు.. చేతికి ?10 రూపాయలు!**

**-టాస్మాక్ షాపుల దగ్గర సరికొత్త రివర్స్ వెండింగ్ ఏఐ మెషీన్లు**

**.-పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా తమిళనాడు ప్రభుత్వ వినూత్న ప్రయోగం.**

.తమిళనాడులో మద్యం ప్రియులకు విజయ్ సర్కార్ అదిరిపోయే బంపర్ ఆఫర్ ప్రకటించింది. వినడానికి కాస్త వింతగా ఉన్నా.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సరికొత్త ఐడియాకు శ్రీకారం చుట్టింది అక్కడి ప్రభుత్వం. ఇకపై మద్యం తాగిన తర్వాత ఖాళీ సీసాలను రోడ్లపైన, పబ్లిక్ ప్లేసుల్లో పడేస్తే కుదరదు.. వాటిని జాగ్రత్తగా తీసుకొచ్చి ప్రభుత్వానికి అప్పగిస్తే.. ఒక్కో బాటిల్‌కు పది రూపాయల నగదును నేరుగా మీ అకౌంట్లో వేయనుంది సర్కార్. దీనికోసం టాస్మాక్ షాపుల దగ్గర సరికొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ మెషీన్లను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్న ఖాళీ మద్యం సీసాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. అంతేకాదు, పగిలిన సీసాల వల్ల సామాన్య ప్రజలు, వాహనదారులు ఎన్నో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే విజయ్ సర్కార్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని టాస్మాక్ షాపుల దగ్గర కొత్తగా రివర్స్ వెండింగ్ ఏఐ మెషీన్లను ఏర్పాటు చేస్తోంది.ఈ సరికొత్త టెక్నాలజీ విధానం ప్రకారం.. మద్యం తాగిన తర్వాత ఖాళీ మద్యం సీసాను ఈ రివర్స్ వెండింగ్ మిషన్‌లో వేస్తే చాలు.. వెంటనే ఆ మెషీన్ లోని ఏఐ టెక్నాలజీ బాటిల్‌ను స్కాన్ చేస్తుంది. ఆ వెంటనే ఒక్కో ఖాళీ బాటిల్‌కు సంబంధించిన పది రూపాయల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లో పడిపోతుంది. ఖాళీ బాటిల్ మిషన్‌లో వేయడం.. పది రూపాయలు పట్టుకోవడం అనే ఈ క్రేజీ కాన్సెప్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# డీఎస్సీలో కులాల లెక్కలు జాతర

విజయవాడ, జూన్ 16,డీఎస్సీ 2025 పై వైయస్సార్ కాంగ్రెస్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది. అవి రోజురోజుకు శృతిమించి కులాల వద్దకు కూడా చేర్చింది వైయస్సార్ కాంగ్రెస్. గతంలో కమ్మ డీఎస్పీలు అంటూ 2019 ఎన్నికలకు ముందు హడావిడి చేసిన సంగతి తెలిసిందే. తీరా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీకి చెందిన మంత్రి కమ్మ డీఎస్పీలు కాదు.. అన్ని వర్గాల వారికి అవకాశం ఇచ్చారని శాసనసభలో ప్రకటించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ 2025 పై దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గం వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని చెబుతూ.. కమ్మ డీఎస్సీ అంటూ ప్రచారాలు ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం చానల్స్ లో కూర్చోబెట్టి.. రిటైర్మెంట్ తీసుకున్న అధికారులతో కమ్మ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ విషం చిమ్మడం మొదలుపెట్టారు.డీఎస్సీ 2025 పై ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఓపికగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కమ్మ డీఎస్సీ ఆరోపణలపై కూడా ఏపీ ఫ్యాక్ట్ చెక్ రంగంలోకి దిగి.. అదంతా తప్పుడు ప్రచారం అని తేల్చేసింది. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన పోస్టులు 381. ఈ 381 పోస్టుల్లో ఓపెన్ క్యాటగిరి కింద ఉన్నవి కేవలం 42 పోస్టులు మాత్రమే. మిగిలిన పోస్టులన్నీ ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ వర్గాలకు దక్కాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆనాలపై రెండు ఓపెన్ క్యాటగిరి పోస్టులు వాటిని పరిశీలిస్తే అందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు వచ్చినవి కేవలం 9 పోస్టులు మాత్రమే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పది పోస్టులు, కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అత్యధికంగా 16 పోస్టులు వచ్చాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుడు అని అందరికీ తెలుసు. ఎందుకంటే 381 పోస్టుల్లో.. 9 పోస్టులు అంటే కనీసం మూడు శాతం కూడా లేవు. కానీ ఏ లెక్క ప్రకారం స్పోర్ట్స్ కోటా మొత్తం ఒకే కులానికి కట్టబెట్టారు.. ఇందులో భారీ స్కాం జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం బ్యాచ్. కేవలం మెరిట్, క్రీడా సర్టిఫికెట్ల స్క్రూటిని ఆధారంగా జరిగిన ఈ నియామక ప్రక్రియను.. ఒక కులానికి ఆపాదించి వివాదం చేయడం చూస్తుంటే కుట్ర కోణం అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ ఆరాటం కోసమే నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఆరు లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయడంతో వారిలో గందరగోళం రేపి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ లేదు. అయితే ఆధారాలు లేని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆధారాలు లేని కారణంగా ఆ యూట్యూబ్ ఛానల్ ఆ వీడియోను డిలీట్ కూడా చేసింది. కానీ వదిలిపెట్టే ప్రసక్తి కనిపించడం లేదు. నేరుగా సజ్జల ఫండింగ్ చేసిన ఆ ఛానల్ సంగతి తేల్చాలన్న అభిప్రాయం కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది.

# వేమిరెడ్డికి కీలకం పదవి...

నెల్లూరు, జూన్ 16, నెల్లూరు అంటేనే మొదటి నుంచి కాంగ్రెస్ కి తరువాత కాలంలో వైసీపీకి అచ్చి వచ్చిన జిల్లాగా పేరుంది. రెడ్లు పెద్ద ఎత్తున రాజకీయ ప్రాబల్యం కలిగిన జిల్లాగా నెల్లూరుని చెబుతారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం పది ఎమ్మెల్యే సీట్లు ఉంటే 2019లో పదికి పది స్వీప్ చేసి వైసీపీ శభాష్ అనిపించుకుంది. అయితే గిర్రున అయిదేళ్ల కాలం తిరిగేసరికి టీడీపీ కూటమి అదే ఫీట్ ని రివర్స్ లో చేసి వైసీపీకి భారీ షాక్ ఇచ్చేసింది. ఫలితంగా వైసీపీకి ఒక్కరంటే ఒక్కరు ఎమ్మెల్యే లేకుండా పోయారు. బలమైన నేతలు అంతా ఇపుడు టీడీపీలోనే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ మొదటి నుంచి కూడదీసుకునే పనిలో ఉంది. కూటమి తన జోరుని ఎక్కడా తగ్గించడం లేదు, ప్రత్యేకించి టీడీపీ అయితే 2024లో దక్కిన విజయాన్ని ఆ రాజకీయ పట్టుని శాశ్వతం చేసుకోవాలని చూస్తోంది. దాని కోసం భారీ ఎత్తున వ్యూహ రచన కూడా చేస్తోంది.నెల్లూరు జిల్లాలో అంగ బలం అర్ధ బలం దండీగా ఉన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ భారీ గిఫ్ట్ ఇవ్వబోతోంది అని ప్రచారం సాగుతోంది. ఆయన 2018 నుంచి 2024 దాకా రాజ్యసభ మెంబర్ గా వైసీపీలో పనిచేశారు. వైసీపీని నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా నిలబెట్టడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఆయనకు 2024 ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే సీటు ఇవ్వడానికి వైసీపీ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టీడీపీ వైపు వచ్చారని ప్రచారం సాగింది. టీడీపీ ఆయనను సాదరంగా ఆహ్వానించి అక్కున చేర్చుకుని ఆయనకూ ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డికి కూడా టికెట్లు ఇచ్చింది. దాంతో మొత్తం నెల్లూరు జిల్లా టీడీపీ కూటమికి చిక్కింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రివర్గంలో పదవి దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది. ఆయనకు సామాజిక పరంగానే కాదు రాజకీయంగా ప్రాంతీయ సమీకరణల దృష్ట్యా ఈ పదవిని ఇవ్వడం సముచితం అని పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా ఉన్న నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక ఆ ప్రభావం కచ్చితంగా రాయలసీమ మీద కూడా పడుతుందని వచ్చే ఎన్నికల్లో వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో సైతం కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని కూడా టీడీపీ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడిన వారిని వెనక్కి రప్పించే ప్రయత్నంలో వైసీపీ అధినాయకత్వం ఉంది అని ప్రచారం సాగుతోంది. ఇక వేమిరెడ్డి మీద కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది అని కూడా చెప్పుకున్నారు. ఆయన విలువ ఏమిటి అన్నది వైసీపీకి 2024 ఎన్నికల ఫలితాల తరువాత తెలిసింది అని అంటున్నారు. అయితే టీడీపీలో వేమిరెడ్డికి గౌరవం దక్కుతోంది, అంతే కాదు ఆయన అనుకున్నది చేసే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే కనుక వైసీపీకి రాజకీయంగా మరింత దెబ్బ పడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్ధ బలంతో పాటు కేంద్ర మంత్రిగా బలం కూడా తోడు అయితే నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ రెక్కలు జోరందుకోకుండా బ్రేకులు పడతాయని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది వేచి చూడాల్సి ఉంది.

నల్లపురెడ్డి దారెటు...

నెల్లూరు జిల్లాలో రాజకీయాలు హీటెక్కాయి. ఎన్నికలకు మూడేళ్లకు ముందే టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. వేమిరెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రసన్నకుమార్ రెడ్డి వద్ద ప్లాన్ ఏంటి? కోవూరు నియోజకవర్గంలో ప్రశాంతి రెడ్డిని ఎదుర్కొనేందుకు నల్లపురెడ్డి వద్ద ఉన్న వ్యూహాలేంటి? అన్న దానిపై చర్చ జరుగుతుంది. ఎందుకంటే బలమైన నేతను ఎదుర్కొనాలంటే అంత ఆషామాషీ కాదు. జనంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తేనే తప్ప విజయం సాధ్యం కాదు. కానీ ప్రశాంతి రెడ్డి ఆ ఛాన్స్ ను నల్లపురెడ్డికి ఎంతమేరకు ఇస్తారన్నది ప్రశ్న.కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిల మధ్య తీవ్రమైన రాజకీయ మరియు విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం చుట్టూ తిరుగుతుంది. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మధ్య వార్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత విమర్శలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రసన్న కుమార్ రెడ్డి గతంలో ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై ప్రశాంతి రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో, మహిళల ఫిర్యాదు మేరకు ప్రసన్న కుమార్ రెడ్డిపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇటీవల వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపైనా, కూటమి ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. దీనికి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మెరుపుతీగలా కోవూరుకు వచ్చి వెళ్లే నేత గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని ప్రశాంతి రెడ్డి నల్లపురెడ్డి పై విరుచుకుపడ్డారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రసన్న గెలవలేంటూ సవాల్ విసిరారు. అంతేకాదు కోవూరు నియోజకవర్గంలో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించడం వివాదం గా మారింది. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే కోవూరు రాజకీయాలతో సలసల మండుతోంది.

# అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తి

తిరుపతి, జూన్ 16, తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేత ఎన్. అమరనాథ రెడ్డి ఎక్కడున్నారు. ఆయన టీడీపీలోనే ఉన్నారా? అసలు ఏం జరుగుతుంది? పార్టీలో ఒక్కసారిగా సైలెంట్ అయిన అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తికి లోనవుతున్నారా? అన్న అనుమానం కలుగుతుంది. దాదాపు రెండేళ్ల నుంచి అమరనాథ రెడ్డి పార్టీ లో యాక్టివ్ గా లేరు. గతంలో రాజకీయంగా కీలకంగా వ్యవహరించే అమరనాథ రెడ్డి ఈ టర్మ్ లో మాత్రం మౌనం పాటించడం వెనక కేవలం అసంతృప్తి కారణమని పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు 2024 ఎన్నికల తర్వాత ప్రాధాన్యత దక్కడం లేదన్న అభిప్రాయంలో అమరనాథ రెడ్డి ఉన్నారు. అందుకే అమరావతికి కూడా దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు.చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి అమరనాథ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఉన్న ఈ నేత అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే తనకు తొలి విడత మంత్రి పదవి దక్కుతుందని భావించినప్పటికీ ఆయనకు రాలేదు. చిత్తూరు జిల్లా నుంచి కేవలం ముఖ్యమంత్రి గా చంద్రబాబు మాత్రమే ఉన్నారు. మరెవరికీ అవకాశం కల్పించలేదు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మినహా మరే సందర్భంలో వీరు పెద్దగా కనిపించడం లేదు. అలాగే విపక్షాలు చేసే విమర్శలకు సయితం స్పందించడం లేదు.1996లో పుంగనూరు నియోజకవర్గంకి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2012లో టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.తర్వాత జూన్ 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విడి టీడీపీలో చేరాడు. 2017లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ విస్తరణలో భాగంగా అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి లభించింది. 2024లో ఎన్నికల్లో తిరిగి టీడీపీ నుంచి విజయం సాధించారు. ట్రాక్ రికార్డును చూసిన తర్వాత మంత్రి పదవి దక్కాల్సి ఉన్నా రాకపోవడంతో ఆయన తన పెదవి విప్పడం లేదని అంటున్నారు.

# దాడి వీరభద్రరావు దారెటు..

విశాఖపట్టణం, జూన్ 16, ఉమ్మడి విశాఖ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా దాడి వీరభద్రరావు ఉన్నారు. ఆయన 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలా వరసగా నాలుగు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించిన దాడి 2007 నుంచి 2013 దాకా శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. అయితే ఆయన వైసీపీలోకి వెళ్ళడంతో ఆయన రాజకీయ జీవితం మీదనే కాకుండా కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో అయ్యన్నపాత్రుడితో సరిసమానంగా దాడి వీరభద్రరావు 1980, 1990 దశకంలో రాణించారు. ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చి ఎన్టీఆర్ గౌరవించారు. అలాగే కీలక శాఖలను కూడా ఈ ఇద్దరు నేతలూ చూశారు. పూర్వాశ్రమంలో హిందీ మాస్టార్ గా పనిచేసిన దాడి అంటే ఎన్టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఆయనకు కీలక స్థానం పార్టీలో కల్పించారు. ఇదిలా ఉంటే పార్టీ పదవులలో కూడా దాడికి ప్రముఖ స్థానం ఉంటూ వచ్చింది. అయితే ఆయన 2013లో తన ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేయలేదన్న కారణంతో టీడీపీని వీడారు. రాజకీయంగా అదే పెద్ద పొరపాటు అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.అనకాపల్లిలో దాడి వీరభద్రరావు తన హవాను దశాబ్దాల పాటు చాటుకుంటూ వచ్చారు. ఎపుడైతే ఆయన టీడీపీని వీడారో నాటి నుంచే ఆయన ప్రాభవం తగ్గుతూ వచ్చింది. వైసీపీలో కూడా సరైన అవకాశాలు దక్కలేదు. దాంతో 2024 ఎన్నికల ముందు తిరిగి టీడీపీలో దాడి వీరభద్రరావు చేరారు. అయితే ఆయన కుమారుడు దాడి రత్నాకర్ కి అనకాపల్లి టికెట్ ఆశించినా దక్కలేదు. అయితే 2029 ఎన్నికల మీదనే దాడి కుటుంబం ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు.అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ కి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి వారసులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా టీడీపీ సంకేతాలు పంపించింది. దాంతో దాడి లాంటి సీనియర్లలో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయని అంటున్నారు. తన వారసుడిని కూడా ఎమ్మెల్యేగా చూడాలని దాడి మాస్టారు ఆశ పడుతున్నారు. అనకాపల్లిలో టీడీపీ బలంగా ఉంది. ఇక దాడికి ప్రత్యేక వర్గం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల మీద ఫోకస్ పెట్టి దాడి కుటుంబం పనిచేస్తోంది. అయితే అనకాపల్లిలో టీడీపీకి ఎంతో మంది నాయకులు ఉన్నారు. టికెట్ కోసం భారీ పోటీ ఉంది. దాడి పార్టీని వీడాక చాలా మంది నాయకులు తయారయ్యారు. ఈ నేపథ్యంలో వారిని అందరినీ దాటుకుని అధినాయకత్వం మన్ననలు అందుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. ఇక పార్టీలో అవకాశాలు దక్కాలీ అంటే విధేయత కొలమానంగా చూస్తున్నారు.అలాగే పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికే పట్టం కడుతున్నారు. మరి దాడి కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నదే ఆయన అనుచరుల ఆలోచనగా ఉంది. మాస్టార్ రాజకీయ వారసత్వం కొనసాగాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నప్పటికీ అనకాపల్లి టీడీపీ రాజకీయం మాత్రం అంత సానుకూలంగా లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పీక్స్ కు చేరిన బ్రదర్స్ వార్

విజయవాడ, జూన్ 16, బెజవాడ పొలిటికల్ స్క్రీన్ మీద సరికొత్త 'బ్రదర్స్ వార్' పీక్స్ కి చేరింది. నిన్నటివరకు పార్టీల మార్పు, టికెట్ల రాజకీయం చుట్టూ తిరిగిన కేశినేని సోదరుల వివాదం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకరి జాతకాలను ఒకరు రోడ్డుపైకి లాగుతూ, ఏకంగా వందల కోట్ల బ్యాంక్ స్కామ్స్, ఈడీ ఫిర్యాదుల వరకు వెళ్లడంతో ఏపీ పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. 2024 ఎన్నికల ముగిసినా వీరి మధ్య మంటలు చల్లారకపోగా.. మరింత ముదరడం గమనార్హం. ఈ పొలిటికల్ ఫైట్‌లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని వేసిన సరికొత్త స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది. తనపై వస్తున్న బినామీ, భూ ఆక్రమణల ఆరోపణలకు చెక్ పెడుతూ.. ఆయన నేరుగా మాజీ ఎంపీ కేశినేని నాని ఆర్థిక మూలాలనే టార్గెట్ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును నాని అడ్డంగా ముంచేశారని, దాదాపు రూ.120 కోట్ల ప్రజాధనాన్ని మొండి బకాయిలుగా మార్చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిబంధనల్లోని లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ నాని విజయవాడ 'విజయ్ మాల్యా'లా మారారని, చివరకు ఆయన ఉంటున్న ఇల్లు, వాడుతున్న హోటల్ కూడా బ్యాంక్ ఆధీనంలోనే ఉన్నాయంటూ చిన్ని బాంబ్ పేల్చారు. అయితే, తమ్ముడు వేసిన ఈ రివర్స్ అటాక్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఏమాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా వేదికగా ఆయన రీ-కౌంటర్ ఇచ్చారు. వేల కోట్ల ప్రభుత్వ భూములను ఒక కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టే పెద్ద డీల్‌ను తాను సీఎంకు లేఖ రాసి అడ్డుకున్నానని, ఆ ఫ్రస్టేషన్‌తోనే తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్ హోల్ అడ్డంపెట్టుకుని న్యాయస్థానాలనుసైతం కేశినేని నాని తప్పుదోవ పట్టించారని, తనపై పోటీ చేసిన అభ్యర్థుల్ని ఫ్రాడ్ అనటం కేశినేని నానికి అలవాటని కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి బయటకొస్తూ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లనూ విమర్శించాడు. ఒక్క సాక్షి మీడియా, జగన్‌ను తప్ప ఇతరులదరినీ విరమర్శించే నాని ఆంతర్యం ఏంటి? అంటూ చిన్ని ప్రశ్నించారు.జగన్ పంథాలోనే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు చేయటం నానికి అలవాటు. సామాజిక మాధ్యమం వేదికగా నాని నాపై చేసేది అసత్య ఆరోపణలే. దీనిపై పోలీసులు తమ పని తాను చేసుకెళ్తున్నారు. విజయవాడ ప్రజలకు, అలాగే చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే తాను జవాబుదారినని, సోషల్ మీడియా పోస్టులకు కాదని పేర్కొన్నారు. తనపై చేసే ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే వాటికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని కేశినేని చిన్నీ స్పష్టం చేశారు.

బెజవాడ పాలిటిక్స్‌లో ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

ఈ ఇద్దరు నేతల మధ్య నడుస్తున్న ఈ కోట్ల రూపాయల మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలకు దారితీస్తుందో చూడాలి.

# రామ్మోహననాయుడికి ఆఅవకాశం లేదా...

శ్రీకాకుళం జూన్ 16, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి కూత వేటు దూరంలో నిలిచింది. వచ్చే నెలలో ప్రారంభోత్సవం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రైవేటు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను జూలై 5 నుంచి ప్రారంభించనున్నాయి. వాటికి సంబంధించి ప్రత్యేక ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చూస్తుంటే మాత్రం జూలైలో విమానాశ్రయం ప్రారంభం గ్యారెంటీ అని తెలిపోయింది.భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంలో.. ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఉంది. గత రెండేళ్లుగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను పరుగెత్తించారు. అందుకే పనులు చాలా వేగంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే చాలా వేగంగా పనులు జరిగాయి. ఇక్కడ విమాన రాకపోకలకు సంబంధించి ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. చివరిగా పెండింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.అయితే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయానికి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఆయన ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు దక్కాయి కేంద్రంలో. రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఏదో ఒక వివాదం రేగుతూనే ఉంది. ఆయన శాఖ మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది.కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నెల 20న ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 18 తో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది. అందుకే మంత్రి వర్గ విస్తరణలో కొత్తవారికి చోటుతోపాటు పాత వారి శాఖల కేటాయింపు ఉంటుందన్న టాక్ ఉంది. పౌర విమానయాన శాఖ నుంచి తప్పించి.. రామ్మోహన్ నాయుడుకు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ఇస్తారని ఎప్పటినుంచో ప్రచారంలో ఉంది. అదే జరిగితే పౌర విమానయాన శాఖ మంత్రిగా భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో.. ప్రధాని తరువాత అదే స్థాయిలో గౌరవం దక్కాల్సిన రామ్మోహన్ నాయుడుకు ఆ ఛాన్స్ లేనట్టే. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# ఎన్డీయేకు మద్దతుగా టీఎంసీ రెబల్స్

న్యూఢిల్లీ, జూన్ 16 జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నగ్న సత్యాన్ని నిరూపిస్తూ పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన సుమారు 20 మంది రెబల్ ఎంపీలు కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం సరికొత్త సంచలనానికి తెరలేపింది. వారు ఎన్డీయేలో అధికారికంగా విలీనమవుతారా లేక బయట నుండి మద్దతు ఇస్తారా అనేది పక్కన పెడితే.. కేంద్ర ప్రభుత్వానికి 20 మంది ఎంపీల అదనపు బలం లభించడం ఖాయమైంది. ఈ పరిణామం ఢిల్లీ పీఠాన్ని మరింత సుస్థిరం చేయడమే కాకుండా, కూటమిలోని ఇతర ప్రాంతీయ పార్టీలపై, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ప్రాధాన్యతపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు , నితీష్ కుమార్ అత్యంత కీలకంగా మారారు. కింగ్ మేకర్లుగా ఉన్న వీరిద్దరి డిమాండ్లకు లొంగుతూనే మోదీ–షా ద్వయం ఇన్నాళ్లూ బండిని లాగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఊహించని విధంగా 20 మంది ఎంపీల మద్దతు లభించడంతో కేంద్రంలో ఎన్డీయే నెంబర్ గేమ్ పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు , నితీష్ కుమార్ లలో ఎవరైనా ఒకరు మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా ఉండదనే బలమైన భరోసా ఇప్పుడు బీజేపీ అధిష్టానానికి దక్కింది. ఈ సమీకరణం సహజంగానే కూటమిలో బీజేపీ బేరసారాల శక్తిని పెంచుతుంది. లోక్‌సభలో అదనంగా 20 మంది ఎంపీల బలం తోడవడంతో.. మిత్రపక్షాల వీటో పవ గణనీయంగా తగ్గింది. ఇది మోదీ, అమిత్ షాలకు రాజకీయంగా పెద్ద ఊరట. ఈ అనుమానాలు రాజకీయ వర్గాల్లో తలెత్తుతున్నాయి. చంద్రబాబు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోతుందని చెప్పలేం కానీ, గతంలో ఉన్నంత లీవరేజ్ మాత్రం ఇకపై ఉండకపోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక నిధులు, పోలవరం బడ్జెట్, అమరావతి గ్రాంట్ల విషయంలో చంద్రబాబు కేంద్రంపై గతంలో చూపించినంత ఒత్తిడిని ఇకపై ప్రదర్శించడం అంత సులువు కాదు. ఎందుకంటే, కేంద్రంపై ఒత్తిడి మితిమీరితే.. ప్రత్యామ్నాయంగా తమకు టీఎంసీ ఎంపీల మద్దతు ఉందనే సంకేతాన్ని మోదీ, షా ఇవ్వడానికి వెనుకాడరు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల దీర్ఘకాలిక ఆలోచనలు వేరేలా ఉన్నాయి. వారు చంద్రబాబును అంత తేలికగా దూరం చేసుకోరని ఇండస్ట్రీ ఇన్సైడర్స్ అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు నమ్మకమైన, క్రమశిక్షణ కలిగిన మిత్రపక్షంగా ఉన్నారు. దానికి భిన్నంగా, పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న టీఎంసీ ఎంపీల మద్దతు తాత్కాలిక అవసరాల కోసమో, మమతా బెనర్జీతో విభేదాల వల్లో పుట్టుకొచ్చిందే తప్ప, సిద్ధాంతపరమైనది కాదు. రేపు ఏదైనా తేడా వస్తే వారు మళ్లీ ప్లేట్ మార్చే ప్రమాదం ఉంది. కాబట్టి, నమ్మకమైన చంద్రబాబును పూర్తిగా పక్కన పెట్టి, అస్థిరమైన టీఎంసీ శ్రేణులపై బీజేపీ పూర్తిగా ఆధారపడే సాహసం చేయదు. ఈ జాతీయ పరిణామాలు ఆంధ్రప్రదేశ్ అంతర్గత రాజకీయాలపై కూడా ఖచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఈ అంశాన్ని అస్త్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇకపై ఢిల్లీలో చంద్రబాబును మోదీ ప్రభుత్వం పట్టించుకోదు అంటూ ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించింది. అయితే, చంద్రబాబుకు ఉన్న ఇమేజ్, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆయనకు ఉన్న విజన్ దృష్ట్యా.. ఆయన కేంద్రంతో ఘర్షణ వైఖరి పెట్టుకోకుండా, మరింత చాకచక్యంగా దౌత్యనీతిని ఉపయోగించి ఏపీకి రావలసిన హక్కులను సాధించుకుంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీఎంసీ ఎంపీల మద్దతు వల్ల ఎన్డీయే కూటమిలో బీజేపీ సీటు కాస్త గట్టిపడిందనేది పచ్చి నిజం. చంద్రబాబుపై ఆధారపడే పరిస్థితి గతంతో పోలిస్తే మోదీ–షాలకు కాస్త తగ్గింది. కానీ, పారదర్శకమైన పాలనలో చంద్రబాబు వంటి సీనియర్ లీడర్ భాగస్వామ్యం ఎన్డీయే ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్ వాల్యూని ఇస్తుంది. కాబట్టి చంద్రబాబు హోదాను తగ్గించడం కంటే.. మిత్రపక్షాలన్నింటినీ సమతూకం చేస్తూనే, తమ సొంత ఎజెండాను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికే మోదీ–షా ద్వయం ఈ కొత్త నెంబర్లను వాడుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

హైదరాబాద్, జూన్ 16 తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించి వెళ్లారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్‌లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు.

అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్‌గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం వేస్తున్న పొలిటికల్ సవాళ్లకు సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది అనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు ప్యానల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అందుకే, రేవంత్ రెడ్డిని ఢీకొట్టే బాధ్యతలను కేటీఆర్, హరీష్ రావులకు వదిలేసి.. తాను మాత్రం కేవలం ప్రజాక్షేత్రం లోనే తేల్చుకోవాలనే పంథాను ఎంచుకున్నారు. ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. గతంలో ఫ్లాప్ అయిన బస్సు యాత్ర ఫార్ములాతో కేసీఆర్ మళ్లీ ప్రజలను ఆకట్టుకోగలరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అసెంబ్లీ ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దారుణంగా చెల్లాచెదురైంది. అటు బీజేపీలోకి, ఇటు కాంగ్రెస్‌లోకి కీలక నేతలు, కేడర్ వలస వెళ్లడంతో గులాబీ కోట బలహీనపడింది. ప్రస్తుతం కాంగ్రెస్ హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజల్లో కనిపిస్తున్న చిన్నపాటి అసంతృప్తిని క్యాష్ చేసుకోవడానికి కేసీఆర్ వాగ్ధాటి ఉపయోగపడుతుందని భావిస్తున్నప్పటికీ.. జనం గతాన్ని అంత సులభంగా మర్చిపోతారా అనేది అనుమానమేకేసీఆర్ బస్సు యాత్ర కేవలం ఒక ప్రచార పర్వం మాత్రమే కాదు, అది బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్య. కేటీఆర్, హరీష్ రావు ఎంతగా కష్టపడుతున్నా.. పార్టీని నడిపించే కరిష్మా కేవలం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. ఈ యాత్ర ద్వారా ఆయన తన పాత ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోగలిగితే తెలంగాణలో మళ్లీ ముక్కోణపు పోటీ వస్తుంది; లేదంటే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిపోయి బీఆర్ఎస్ మరింత మూలనపడే ప్రమాదం ఉంది. అందుకే కేసీఆర్ సీరియస్‌గా ఈ యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి.

# ఆర్టీసీ పేరును గుర్తు చేస్తున్న బస్సులు

హైదరాబాద్, జూన్ 16 (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో బస్సులు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నానల్‌నగర్, ఖైరతాబాద్ జంక్షన్, మాసబ్‌ట్యాంక్ కట్టమైసమ్మ దేవాలయం వంటి ప్రాంతాల్లో బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు ఒత్తిడి పడుతోంది. కొత్త బస్సులు రాకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.విడిభాగాల కొరత, ఆయిల్ సకాలంలో మార్చకపోవడం వంటి కారణాల వల్ల బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వైరింగ్, పార్ట్స్ సమస్యల వల్ల కొన్ని బస్సుల నుంచి పొగలు వస్తున్నాయి. డిపోలలో ఫిట్‌నెస్ పరీక్షలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.మహానగరానికి 7 వేల బస్సులు అవసరం ఉండగా, ఆర్టీసీ ప్రస్తుతం 3200 బస్సులతోనే నెట్టుకొస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు కాగా, మిగిలినవి డీజిల్ బస్సులు. హైదరాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటిన బస్సులు సుమారు 250, పదేళ్లు దాటినవి 350 ఉన్నాయి. సికింద్రాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటినవి 300, 10 సంవత్సరాలు దాటినవి 300 ఉన్నాయి. ఈ పాత బస్సులు కాలుష్యాన్ని వెదజల్లడమే కాకుండా, రోజుకు 6 నుండి 8 ట్రిప్పులు తిరుగుతున్నాయి.

## వర్షాలకు కూలిన ప్రభుత్వ పాఠశాల భవనం..

## తప్పిన పెను ప్రమాదం

నాగర్కర్నూల్ అచ్చంపేట మండలం చౌటపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం కూలిపోయింది. శిథిలావస్థకు చేరిన ప్రాథమికోన్నత పాఠశాల భవనం భారీ వర్షాలకు కూలిపోయింది. తరగతి గదులు నేలమట్టం కావడంతో గ్రామస్తులు ఆందోళనలో వున్నారు. పాఠశాలకు సెలవులు ఉండటంతో విద్యార్థులు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. పాఠశాల ప్రారంభమైన రోజు వచ్చిన ఉపాధ్యాయులు భవనం కూలిన దృశ్యాలను చూసిగ్భ్రాంతికి గురైయారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే పాఠశాల భవనం కూలిపోవడంపై చర్చనీయంశాయమయింది.

# ఉద్ధవ్ శివసేనలో మరో చీలిక

ముంబై, జూన్ 16 మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. అంతా బాగుంటుందనుకున్న సమయంలో మాజీ సీఎం, శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే కి సొంత పార్టీ ప్రజా ప్రతినిధులే షాక్ ఇచ్చారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన నుంచే విడిపోయిన వేరు కుంపటి పెట్టుకున్న ఏకనాథ్ షిండేతో ఉద్ధవ్ వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు రహస్యంగా భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రేకి ఝలక్ తగిలినట్లైంది.దీంతో ఉద్ధవ్ వెంటనే అలర్ట్ అయ్యారు. తన నివాసంలో తన వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులందరితో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. తన పార్టీ చీలుతోందన్న గట్టి అనుమానం రావడంతో వెంటనే కీలక సమావేశం నిర్వహిస్తున్నారు.ఆపరేషన్ టైగర్"లో భాగంగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి కొందరు ఎంపీలు మారవచ్చన్న ఊహాగానాల మధ్య ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ఈ భేటీలో రాజకీయం లేదని, అంత ప్రాధాన్యత భేటీ కూడా కాదని డిప్యూటీ సీఎం షిండే కొట్టిపారేశారు.అయితే, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ లోని అసమ్మతి వర్గం బీజేపీకి మద్దతు ప్రకటించడంతో, కేంద్రంలో రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. తమకు 20 మంది ఎటిఅ ఎంపీల మద్దతు ఉందని ఆ అసమ్మతి వర్గం పేర్కొంటోంది.ఈ భయం కూడా ఉద్ధవ్ కి వున్నట్లు పుకార్లు వస్తున్నాయి.మహారాష్ట్రలో కొత్త రాజకీయ పరిణామాలకు సంబంధించిన ఊహాగానాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశాన్ని ఆ సంస్థ యొక్క విశ్వసనీయతను మరియు అంతర్గత ఐక్యతను అంచనా వేసే ప్రయత్నంగా భావిస్తున్నారు; ఎందుకంటే,యూబీటీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో ఏడుగురు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని మరియు శివసేనలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి.జూన్ 7న న్యూఢిల్లీలో షిండేతో ఆ ఎంపీలు సమావేశమయ్యారని, అప్పుడు వారికి శివసేనలో చేరే ప్రతిపాదన చేశారని సమాచారం. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తూ, 'ఆపరేషన్ టైగర్' దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుందని కేంద్ర మంత్రి మరియు శివసేన ఎంపీ ప్రతాప్‌రావు జాదవ్ ప్రకటించారు.ప్రస్తుతం లోక్‌సభలో షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడుగురు సభ్యులు ఉన్నారు; భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ మరియు జనతాదళ్ (యునైటెడ్) తర్వాత నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్లో ఇది మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షంగా ఉంది.ఒకవేళ యూబీటీ కి చెందిన ఏడుగురు ఎంపీలు షిండే సేనలో చేరాలని నిర్ణయించుకుంటే, అది పార్టీ చీలికకు దారితీయడంతో పాటు దిగువ సభలో ఔఅం బలాన్ని పెంచుతుంది.

# చిన్నారి మిస్సింగ్ కేసు

కాకినాడలో అదృశ్యమైన చిన్నారి జానును అటవీ మృగాలు లాక్కెళ్లి ఉంటాయని అనుమానంగా ఉందని జిల్లా ఎస్పీ బింధూ మాదవ్ అన్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చిన్నారిని ఎవరూ తీసుకెళ్లినట్లు లేదు కాబట్టి అడవి జంతువులు లాక్కెళ్లాయని అనుమానిస్తున్నాము. కానీ ఏ కోణంలోనూ ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు దొరకలేదు. పాప అదృశ్యమైన రోజు వర్షం పడింది, ఇలాంటి కొండ ప్రాంతంలో వర్షపు నీరు జారుతూ ఉంటుంది. అలా వరద నీటిలో కిందకి జారుతూ వెళ్ళిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నాము. ప్రస్తుతానికి థర్మల్ డ్రోన్ల సహాయంతోనూ గాలింపు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

## అక్రమ ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులపై కాంగ్రెస్ నాయకుడు దాడి

యాదాద్రి భువనగిరి ఆలేరు నియోజకవర్గంలో రాత్రి వేళల్లో ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమ ఇసుక తరలింపును పోలీసులు గుర్తించారు. ఇసుక ట్రాక్టర్లు పట్టుకున్న పోలీసులపై కాంగ్రెస్ నాయకుడు ఆలేరు మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గందమల్ల అశోక్ పోలీస్ స్టేషన్కు వెళ్లి మరీ చిందులేస్తూ, బెదిరించాడు. ఇలా బెదిరిస్తే తాము పని చేయలేమని ఆలేరు పోలీసులు వాపోతున్నారు.

## చిక్కడపల్లి లైబ్రరీ వద్ద నిరుద్యోగుల మెరుపు ధర్నా

హైదరాబాద్ చిక్కడపల్లి సిటి సెంట్రల్ లైబ్రరీ దగ్గర నిరుద్యోగులు సోమవారం రాత్రి మెరుపు ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అశోక్ నగర్ వరకు ర్యాలీ తీసారు. నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసారు. సిన పోలీసులు

# కాంగ్రెస్ లో పదవుల పంచాయితీ

హైదరాబాద్, జూన్ 16 కాంగ్రెస్ పార్టీలో సీనియర్లలో అసంతృప్తి పెరుగుతుంది. ఇందుకు సీనియర్ నేత షబ్బీర్ ఆలి ఉదాహరణ. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందులకు గురి చేశాయి. కాంగ్రెస్ పార్టీలో పదవులను డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారని షబ్బీర్ ఆలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కష్టించి పనిచేసిన నేతలకు కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి డబ్బులు ఇచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని షబ్బీర్ ఆలి చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో కాక రేపాయి. గత కొంత కాలంగా షబ్బీర్ ఆలి అసంతృప్తితో ఉన్నారు.తనను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా మరొక నేతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారని ఆయన భావిస్తున్నారు. గత కొంత కాలం నుంచి షబ్బీర్ ఆలి కి, చంద్రశేఖర్ రెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకంటున్నారు. ఈ ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలోనే షబ్బీర్ ఆలీ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తుంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏఐసీసీ కూడా అంతే స్థాయిలో స్పందించింది. షబ్బీర్ ఆలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.అయితే షబ్బీర్ ఆలీ మాత్రం ఆ వ్యాఖ్యలకు, తనకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు. ఆ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారంటూ షబ్బీర్ ఆలీ వివరణ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ తో తనకు సుదీర్ఘ కాలం నుంచి తెలుసునని, మంచి మిత్రుడని చెప్పారు. ఆయనపై తాను వ్యతిరేక వ్యాఖ్యలు ఎందుకు చేస్తానని షబ్బీర్ ఆలీ అన్నారు. షోకాజ్ నోటీసులకు అవసరమైన సమాధానాన్ని తాను ఇస్తానని కూడా షబ్బీర్ ఆలీ చెప్పారు. మొత్తం మీద కాంగ్రెస్ లో సీనియర్ నేతలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం కూడా పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారిని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

## తెలంగాణలో విచారణల పాలిటిక్స్

హైదరాబాద్, జూన్ 16 తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు.. సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు.కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

# పాపం మహేష్ గౌడ్...




హైదరాబాద్, జూన్ 16 తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న లీకుల రాజకీయం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. ఏఐసీసీ వేదికగా జరిగిన ఒక అనూహ్య పరిణామం.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కుర్చీకే ఎసరు పెట్టే స్థాయికి చేరడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెను సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా ఎంపిక చేసి బరిలోకి దించిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక.. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలే వెన్నుపోటుకు పాల్పడ్డారనే పక్కా ఆధారాలు ఢిల్లీ పెద్దలకు చిక్కాయి. ఈ తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంపై రాహుల్ గాంధీ అత్యంత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మీనాక్షి నటరాజన్ అంటే రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకమైన, విలువలతో కూడిన రాజకీయాలు చేసే సీనియర్ నాయకురాలిగా పేరుంది. మధ్యప్రదేశ్‌లో ఆమె నామినేషన్‌ను తిరస్కరించడానికి బేస్‌గా మారిన తెలంగాణ పాత ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను.. ఇక్కడి కాంగ్రెస్ నేతలే స్వయంగా బీజేపీకి లీక్ చేశారనే అంశంపై ఏఐసీసీ ఇప్పటికే ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించింది. పూర్తిగా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాల వల్లనే పార్టీ జాతీయ స్థాయిలో ఇంతటి అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని రాహుల్ గాంధీకి ప్రాథమికంగానే ఒక స్పష్టత వచ్చేసింది. తన సొంత ఎంపికపైనే దెబ్బకొట్టిన ఈ అంతర్గత శత్రువులను క్షమించే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లీకేజీ వ్యవహారం కేవలం ఒక రాజ్యసభ సీటును కోల్పోవడం కాదు, రాహుల్ గాంధీ నాయకత్వానికే విసిరిన సవాల్‌గా ఢిల్లీ పెద్దలు చూస్తున్నారు. అందుకే, బాధ్యులపై చర్యలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌ను రూట్ లెవెల్ నుండి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ మొత్తం వ్యవహారంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ పాత్రపై తీవ్రమైన స్క్రూటినీ నడుస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కూడా రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమాచారాన్ని, రహస్యాలను కాపాడటంలో, సొంత నేతలను కంట్రోల్ చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారనే బలమైన అభిప్రాయానికి హైకమాండ్ వచ్చింది. ఫలితంగా, తెలంగాణలో పార్టీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మహేష్ కుమార్ గౌడ్‌ను పక్కన పెట్టి.. గ్రూపులను అణచగల ఒక అత్యంత సీనియర్, పవర్‌ఫుల్ లీడర్‌ను టీపీసీసీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ బ్యాక్‌ఎండ్ వర్క్ కూడా ప్రారంభించినట్లు సమాచారం.

ఈ ప్రక్షాళన ప్రభావం కేవలం పార్టీ కమిటీలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ పై కూడా తీవ్రంగా పడబోతోంది. ముఖ్యంగా, ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక డిప్యూటీ సీఎంల మధ్య సాగుతున్న భీకరమైన వర్గపోరు.. ఈ లీకేజీ వ్యవహారానికి ప్రధాన కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొందరు మంత్రుల వెనుక ఉన్న ఒక బడా బిజినెస్ లాబీ.. కాంగ్రెస్‌లో ఉంటూనే సమాచారాన్ని బీజేపీకి చేరవేసే డబుల్ గేమ్ ఆడుతోందని, ఈ నటరాజన్ ఇష్యూలో కూడా ఆ వ్యాపారవేత్తల హస్తం స్పష్టంగా ఉందని నిఘా నివేదికలు చెప్తున్నాయి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన హెవీవెయిట్ మంత్రుల పోర్ట్‌ఫోలియోలను మార్చడం లేదా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా మారింది. మరోవైపు, ఈ సంక్షోభాన్ని ఒక సామాజిక సమీకరణాల మార్పుకు కూడా వేదికగా వాడుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం ప్లాన్ చేస్తోంది. చాలా కాలంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్న మంత్రివర్గ ప్రాతినిధ్య డిమాండ్‌ను నెరవేర్చడానికి.. ఈ లీకుల వ్యవహారంలో దొరికిపోయిన నాన్-పెర్ఫార్మర్ల మంత్రులను కేబినెట్ నుండి తప్పించనున్నారు. ఆ ఖాళీ అయ్యే స్థానాల్లో బీసీ నేతలకు, సీనియర్లకు చాన్స్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ సర్జికల్ స్ట్రైక్ సమయంలో ప్రభుత్వం ఇబ్బంది పడకుండా ఉండేందుకు పార్టీని శాసించగల కొందరు అత్యంత పవర్‌ఫుల్ మంత్రులను ప్రస్తుతానికి టచ్ చేయకుండా.. కేవలం 'వాచ్ లిస్ట్' లో ఉంచి, తగిన సమయంలో వారి సంగతి తేల్చాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తానికి, మధ్యప్రదేశ్‌లో తిరస్కరణకు గురైన మీనాక్షి నటరాజన్ నామినేషన్ ఎపిసోడ్, ఊహించని విధంగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక పెను రాజకీయ భూకంపానికి దారితీసింది.

# సింగూరు డ్యామ్ కు డేంజర్ బెల్స్...

మెదక్, జూన్ 16, ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి. అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పను ల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది. ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు. మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు. పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

# బ్యాంకు రుణాలు కావాలంటే లంచం

హైదరాబాద్, జూన్ 16 రాజేంద్రనగర్ సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ అవసరాలు లేదా స్వయం ఉపాధి కోసం రుణాలు కోరిన మహిళలను అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, లంచాలు అడుగుతున్నారని సమాచారం. దీనిపై సర్కిల్‌లోని పలు సంఘాల మహిళలు తిరుగుబాటు చేసి, అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకులకు లేఖలు రాశారు. విషయం విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో జరిగిన విచారణలో గ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,400 మంది మహిళలకు మంజూరైన రూ. 4.5 కోట్ల రుణం నుంచి రూ. 4.5 లక్షలు లంచాలకే ఖర్చయ్యాయని ఆధారాలు సేకరించారు.

ప్రతి రూ. లక్ష రుణానికి రూ. 1,000 కమిషన్ వసూలు చేస్తున్నట్లు విజయేందర్, లక్ష్మణ్, జె. ఉపేందర్, పి. విజయ్‌కుమార్ వంటి కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు) విచారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. వీరు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించారు. లంచం అడిగినప్పుడు ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించడం, వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం ఈ సీఓలకు అలవాటుగా మారిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నివేదిక ఆధారంగా, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల వేధింపులను అరికట్టాలని అధికారులు కమిషనర్‌కు సిఫార్సు చేశారు.

# హైదరాబాద్లో మరోసారి ఏసీబీ సోదాలు...

### మల్టీజోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో సోదాలు

### భారీగా నగదు స్వాధీనం



హైదరాబాద్ నగరంలో మరోసారి ఏసీబీ సోదాలు కలకలం రేపాయి. ఈ సారి సర్వే శాఖ మల్టీజోన్ 2 డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు జరిపింది. ఆయన కార్యాలయాలు, బంధువుల ఇళ్లలు ఏకకాలంలో తనిఖీలు జరిగాయి. మొత్తం పది చోట్ల సోదాలు నిర్వహించారు. ఉదయం నుండి ఫ్రతి నాకా హౌస్ వద్ద మల్టీ జోన్ డైరెక్టర్ బంధువు ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ అధికారులు బంగారం, ఆస్తి పత్రాలు, సాదా కోర్టు స్టాంప్ పేపర్లు, ఇతర పత్రాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఒక కోటి 10 లక్షలు ఆదాయం ఆస్తులు గుర్తించారు. పలు ఖాళీ బాండ్ పేపర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

# బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష



మేడ్చల్: 11 ఏళ్ల క్రితం బాలికపై జరిగిన అత్యాచార కేసులో నిందితుడికి కోర్టు కఠిన శిక్ష విధించింది. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ పోక్సో కేసును విచారించిన ప్రత్యేక న్యాయస్థానం, నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. అలాగే బాధితురాలికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

### బొల్లారం సదర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ & మిల్క్ పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ & మిల్క్ పథకాన్ని బొల్లారం సదర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, "ప్రజాపాలన ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరు అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి రోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం మరియు పాలు అందిస్తాం. పేద విద్యార్థులకు ఇది ఎంతో మేలు చేస్తుంది" అని అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రామలింగారెడ్డి, విక్రమాదిత్య , స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### వాజ్ పేయి పార్క్ లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి వాకింగ్

విజయవాడ, భవానీపురం వాజపేయి పార్క్ వద్ద స్వచ్ఛభారత్ కార్యక్రమంలో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీ వీ ఎన్ మాధవ్,పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంఎల్ఏ సుజనా చౌదరి, పివిఎన్ మాధవ్ మొక్కలు నాటారు. వాజపేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తరువాత వారంతా పార్క్ లో స్థానిక వాకర్స్ తో కలిసి వాకింగ్ చేశారు.

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

హైదరాబాద్ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు థామస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎస్విక్ లో ఆర్టీసీ సంస్థ ఆవిర్భవించి 94 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీ సంస్థను ప్రభుత్వ రంగంలో విలీనం చేయాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా యూనియన్ లను ఏర్పాటు చేసి ఎన్నికలను నిర్వహించడంపై హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి నెల ఆర్టీసీ కార్మికుల్లో రిటైర్ అవుతున్న వారికి డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో పనిచేసే వారికి ప్రభుత్వం ప్రమోషన్లు కల్పించాలని విన్నవించారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు 200 నూతన బస్సులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

# నిర్మల్ జిల్లాలో ఉద్రిక్తత

## గిరిజనులను అరెస్ట్ చేసిన పోలీసులు

నిర్మల్ కడెం మండలం మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు వ్యవసాయ భూముల హద్దులు చూపిస్తూ హద్దు రాళ్లను పాతుతున్న రెవిన్యూ అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ గ్రామ గిరిజనులకు భూములు కేటాయించిన తర్వాతే హద్దులు చూపించాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేసారు. అడ్డుకున్న గిరిజనులను అటవీశాఖ అధికారులు, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని జన్నారం మండలం ఇంధన్ పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు.

150 మంది పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది భారీ బందోబస్తు మధ్య మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూములను చదును చేస్తూ రెవెన్యూ హద్దు రాళ్లను పాతుతూ వారి పట్టా నెంబర్లను అధికారులు వేస్తున్నారు.

అయితే ఈ భూములలో కొంత నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో పొరుకులు కొట్టుకొని తాము సాగు చేశామని ఆ భూములను తమకు కేటాయించిన తర్వాతే మైసంపేట్ గ్రామస్తులకు భూములు పంపిణీ చేయాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆడపిల్ల పుట్టిందని భార్యను వదిలేసి..

## మరో మహిళతో భర్త సహజీవనం

## న్యాయం చేయాలంటూ బాధితురాలి ఆవేదన

హైదరాబాద్ సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భార్యను, కూతురును వదిలేసిన.. తరువాత భర్త మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడు. వనపర్తి జిల్లాకు చెందిన అర్చనకు 2012లో అదే జిల్లాకు చెందిన రవితో వివాహం కాగా.. అత్తింటి వేధింపులు ఎదుర్కొన్నానని ఆర్చన ఆరోపించింది. ఆడపిల్ల పుట్టిన తర్వాత భర్త, అత్తింటి వారి వైఖరిలో మార్పు వచ్చిందని, తనను నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారని వాపోయింది. తనకు దూరంగా ఉంటూ హైదరాబాద్కు మకాం మార్చిన రవి, మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడని ఆరోపించింది. తనకు ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భర్త రవి వనపర్తి కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశాడని, అయితే ఆ పిటిషన్ను న్యాయస్థానంలో వాదనలు కొనసాగుతున్నాయని, సెటిల్మెంట్ కోసం ఈనెల 28న ఫైనల్ హియరింగ్ ఉండగా న్యాయస్థానంకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు పేర్కొంది.

ఇటీవల కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో భర్త నివాసం వద్దకు వెళ్లిన, అతడు మరో మహిళతో కలిసి జీవిస్తున్న విషయాన్ని గుర్తించింది. దీంతో తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని, భరణం ఇప్పించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. తనకు, తన కూతురుకి న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించింది.

# ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు తగిన గుర్తింపు ఇద్దాం..

## ఎమ్మెల్యే అమిలినేని




కళ్యాణదుర్గం ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు ఉచిత ఉపకరణాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అమిలినేని నియోజకవర్గంలోని ఐదు భవితా సెంటర్ల పరిధిలోని 150 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఉన్నారని వారిని ప్రత్యేకంగా గుర్తించి వారిలో ఉన్న ప్రతిభకు తగిన విధంగా వారికి ఉపకరణాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు పేర్కొన్నారు..నేడు ప్రజావేదికలో సమగ్ర శిక్ష ద్వారా ఎయిడ్స్ మరియు అప్లిన్సెస్ డిస్ట్రిబ్యూషన్ క్యాంప్ వారి నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు భవితా సెంటర్లలో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ఉపకరణాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు, ఎస్ ఎస్ ఏ ఏపీసీ శైలజలు అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల పట్ల కూడా కనికరించలేదని, కేంద్ర ప్రభుత్వానికి 40 శాతం కంట్రిబ్యూషన్ కట్టకుండా వారికి ఇవ్వాల్సిన పరికరాలు కూడా ఇవ్వకుండా చేశారని నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంత్రివర్యులు నారా లోకేష్ గారు వాటిని తిరిగి అమలు చేస్తున్నారని అందులో భాగంగా నేడు మేము ఇక్కడ కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. అంతే కాకుండా చిన్నారులకు మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తామని తెలిపారు..

# కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు

## చేపట్టాలి జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి?పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై కుంగిపోయిన కల్వర్టును జిల్లా కలెక్టర్ అంకిత్ గా పరిశీలించారు. పరిస్థితిని గమనించిన వెంటనే వాహనం దిగి కల్వర్టును తనిఖీ చేసి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్డబీ శాఖ అధికారులను ఆదేశించారు.భవిష్యత్తులో రాకపోకలకు అంతరాయం కలగకుండా సాంకేతిక పరిశీలన నిర్వహించి అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి వర్షాల సమయంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అయన సూచించారు.ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ ఉషారాణి, ఎంఈఓ శాంతారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అందోళనబాటలోబిల్డింగ్ కాంట్రక్టర్లు

హైదరాబాద్ ఆత్మహత్య లు చేసుకుంటున్న కాంట్రాక్టర్ల కుటుంబాలకు భరోసా ఇవ్వడం కోసమే మేము చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టామని బిల్డింగ్ కాంట్రాక్టు అసోసియేన్ అధ్యక్షుడు డివిఎన్ రెడ్డి అన్నారు. మంగళవారం అయన మీడియాతో మాట్లాడారు.

రెండు సార్లు డిప్యూటీ సీఎం ను కలిశామం. దశలవారిగా మాకు బిల్లులు చెల్లిస్తారని చెప్పారు. ఈరోజు సాయంత్రం మరొక సారి డిప్యూటీ సీఎం ను కలుస్తాం .సాయంత్రం మా చలో హైదరాబాద్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని అన్నారు.

మాకు డిజిల్ కు కూడా డబ్బులు లేవు. మూడు నెలలలో 3వేల కోట్ల బిల్లులను చెల్లిస్తే మాకు సంతోషం. ఛాంబర్ ముందు ధర్నా చేసింది మా అసోసియేషన్ కాదు. బీఆర్ఎస్ బ ప్రభుత్వం లో 5వేల కోట్ల అప్పులు తెచ్చారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం ఆవిధంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నామని అన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు

## రంగం సిద్ధం



యాదాద్రి భువనగిరి యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధమయింది. టెంటర్ల ప్రక్రియ ఈ నెల 12 న మొదలయింది. జూన్ 29వ తేదీన ముగియనుంది. జూలై 2వ తేదీన అధికారుఉ టెండర్లు ఓపెన్ చేయనున్నారు. మూడేళ్ల కాల పరిమితితో, రూ.255 కోట్ల వ్యయంతో పవర్ ప్లాంట్ నిర్వహించేందుకు టెండర్లు తెలంగాణ ప్రభుత్వం పిలిచింది.

అయితే ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రా కంపెనీల చేతిలోకి వెళ్లిపోతుందని, ఆంధ్రా పెత్తనం పెరిగిపోతుందని 1300 మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటీకరణను ఆపకపోతే తీవ్రమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని వైటీపీఎస్ ఎంప్లాయిస్ జేఏసీ హెచ్చరిస్తోంది.

# ప్రేమ పేరుతో పని మనిషిని గర్భవతిని చేసిన వ్యాపారి కొడుకు

## స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో కేసు నమోదు చేయని పోలీసులు

రంగారెడ్డి కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో తమ ఇంట్లో పని చేసే 20 ఏళ్ల యువతిని బంగారు వ్యాపారి కుమారుడు సాయికృష్ణ ప్రేమ పేరుతో గర్భవతిని చేసాడు. మూడు నెలల గర్భవతి కావడంతో ఆమెను పెళ్లి చేసుకోవాలని సాయికృష్ణ కుటుంబసభ్యులను యువతి కుటుంబసభ్యులు అడగగా.. సాయికృష్ణ తండ్రి స్థానిక పెద్ద మనుషులతో మంతనాలు జరిపాడు. తనను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని, కులం పేరుతో దూషించి దాడి చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. చివరికి యువతి ఒత్తిడితో సాయికృష్ణపై అట్రాసిటీ కేసు నమోదు చేసారు. యువతిని పరీక్షల నిమిత్తం యువతిని నారాయణపేట జిల్లా కేంద్రానికి తరలించారు.

# బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి



హైదరాబాద్ దేశంలో తెలంగాణ రాష్ట్రంలో నే యాక్సిడెంట్స్ ఎక్కవ జరుగుతున్నాయి. పది ఏండ్ల లో కేసీఆర్ రోడ్ల అభివృద్ధి ని పట్టించుకోలేదు. బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మూడు నెలల్లో సీఎం రేవంత్ తో మాట్లాడి బకాయిలు క్లియర్ చేయిస్తా అని వాళ్లకు హామీ ఇచ్చానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని చలో హైదరాబాద్ ను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసారు.

మంత్రి మాట్లాడుతూ బిల్డర్లు సమ్మె ను విరమించుకుంటారని నమ్మకం ఉంది. సీనియారిటీ ప్రకారం చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాము. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి పట్టించుకోలేదు. కేసీఆర్ హయాంలో 8వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో పెట్టారు. టీమ్స్ ఆసుపత్రి తో కలిపి 10వేల కోట్ల బకాయి ఉంది. యాదగిరిగుట్ట లో కూడా 350 కోట్ల బకాయి ఉంది. ఇప్పటి 3వేల కోట్ల బకాయి చెల్లించాం. 2500 కోట్లు అర్జెంట్ చెల్లించాల్సిన బకాయిలు ఉంది. నాగర్ కర్నూలు శ్రీనివాస్ రెడ్డి అప్పులతో ఆత్మహత్య చేసుకున్నాడు. రఘువీర్ రెడ్డి,శంకర్ లతో సహా 5గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. 25వేల కోట్ల పంచాయతీ రాజ్, ఖీడః రోడ్లు హామ్ వర్క్స్ నడుస్తున్నాయి. 20వేల కోట్లు టెండర్లు, అగ్రిమెంట్స్ అయిపోయాయి. డిండి కి టెండర్లు పిలిచామని అన్నారు.

కేటిఆర్ హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. 2014 కేసీఆర్ వేసిన డబుల్ రోడ్లు, 2018 లో పామ్ హౌస్ కు వేసుకున్న టెండర్లు చుపిస్తాం. 30నెలల్లో జరిగిన అభివృద్ధి పై చర్చకు హరీష్ రావు సిద్ధమా అని అడిగారు. నేను తెలంగాణ ఉద్యమ కారుడిగా నిజాయితీగా పని చేస్తా. సన్న బియ్యం ఇవ్వాలను మాకు కేటిఆర్ చెప్పిండా. పది ఏండ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు,. దోడ్డు బియ్యం ఇస్తే గొడ్లు కూడా తినలేదు. కేసీఆర్ దళితులకు ముఖ్యమంత్రి ఇస్తా అని 10వేల సార్లు చెప్పిందు. సోనియాగాంధీ దేవత ఆమె లేకుండా తెలంగాణ రాదు అన్నడు. భట్టి దళితుడు సీఎల్పి నాయకుడు కాకుండా చేసింద్రు. దళితులకు ప్రతిపక్ష నేత గా ఉండొద్దా అని ప్రశ్నించారు.

# పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు

## శాతం పెంచాలి జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్య, పోషకాహార సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని ప్రీ-ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై సమీక్షించారు.

తల్లిదండ్రులతో నిరంతర సంప్రదింపులు జరిపి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకాహార సేవలను పరిశీలించి హాజరు తక్కువగా ఉండటంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తరువాత పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుత్తికోయలు నివసించే ఈ గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అదనపు నిల్వలను అవసరమైన చోటుకు తరలించాలని, కేంద్రాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ పిల్లల చేరికలు పెంచాలని ఆదేశించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, పిల్లలకు నాణ్యమైన పోషకాహార సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అయన సూచించారు.

# వైరా ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ దివాకర



ఖమ్మంఖమ్మంజిల్లా వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం వైరా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపీ విభాగం, ల్యాబ్తో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాలు, వైద్య పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ అనవసరమైన సి-సెక్షన్లకు తావులేకుండా తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా పర్యవేక్షణ చేయాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి- డిజిపి

### వరద నిర్వహణ, నీటి నిల్వ సమస్యలపై మల్కం చెరువు వద్ద సమన్వయ సమావేశం

### వర్షాకాల సన్నద్ధతపై డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్ష

### సమీక్ష సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు

### హైదరాబాద్ : శాఖల మధ్య సమన్వయంతో నీటి నిల్వ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపాలి

హైదరాబాద్, జూన్ 16: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వర్షాకాలంలో నీటి నిల్వలు, పట్టణ వరదలు, ట్రాఫిక్ అంతరాయాల నివారణకు చేపడుతున్న చర్యలపై మంగళవారం మల్కం చెరువు వద్ద అత్యవసర సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, ఇరిగేషన్, హైడ్రా, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు, ఇంజనీర్లు మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా పోలీసు శాఖ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసి, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేయాలని సూచించారు.నగరంలోని లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ మార్గాల్లో పోలీసు సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని డీజీపీ ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.సమావేశంలో భాగంగా మల్కం చెరువు, ఖాజాగూడ సరస్సు, మండికుంట, గురునాథ్ చెరువు, మియాపూర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు, బయోడైవర్సిటీ జంక్షన్ పరిసర ప్రాంతాలు, కొండాపూర్ మరియు ఇతర వరద ప్రభావిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ప్రత్యేక ఇంజనీరింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ బృందాలు నీటి ప్రవాహ మార్గాలు, ఆక్రమణలు, డ్రైనేజీ అనుసంధానాలు, నీటి నిల్వలకు కారణమవుతున్న అంశాలను సమగ్రంగా పరిశీలించనున్నాయి.అదేవిధంగా, తక్షణ చర్యలు అవసరమైన అంశాలను గుర్తించి వెంటనే పరిష్కరించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా దీర్ఘకాలిక, శాశ్వత పరిష్కారాలపై నివేదికలను సమర్పించనున్నట్లు అధికారులు వివరించారు.పోలీస్, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హైడ్రా మరియు ఇతర శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. అన్ని శాఖలు సమిష్టిగా పనిచేసి సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎక్కడా అలసత్వం లేదా నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రజల భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో ఎటువంటి లోటు ఉండకూడదని డీజీపీ ఆదేశించారు.నీటి నిల్వలు, పట్టణ వరదలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రత, సౌకర్యాలను పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నాయని సమావేశంలో పునరుద్ఘాటించారు.

# కోటపాడు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

## డి.ఎల్. డి.వో శివారెడ్డి సచివాలయ సిబ్బందికి స్ట్రాంగ్ వార్నింగ్



శిరివెళ్ల సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామ సచివాలయాన్ని డి.ఎల్.డి.వో అధికారి శివారెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమావేశమై కార్యాలయంలో జరుగుతున్న వివిధ సేవలు ప్రజల విన్నపాలపట్ల సచివాలయ సిబ్బందికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు కొందరు సిబ్బంది కంప్యూటర్లో అప్లికేషన్ కోసం చేతివాటం ప్రదర్శిస్తూ జీతం కాకుండా అదనంగా సంపాదిస్తున్నారని విమర్శలు అధికంగా వినిపిస్తున్న నేపథ్యంలో ఆయన తనిఖీ చేసినట్లు తెలియజేశారు అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.సచివాలయ రికార్డులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వ సేవలను ప్రజలకు సమర్థవంతంగా అందించాలని సిబ్బందికి సూచించారు. విధుల నిర్వహణలో అవినీతికి బంధు ప్రీతికి ప్రలోభాలకు నాటు కోళ్లు ఫుల్ బాటిల్లు అంటూ సచివాలయ సిబ్బంది గోల్మాల్ విధంగా ప్రవర్తించకుండా నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సిరివెళ్ల ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప, డిప్యూటీ ఎంపీడీవో అశ్వినీకుమార్ సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడలో స్వచ్ఛ భరత్ లో పాల్గొన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

విజయవాడ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితేనే దేశం కూడా అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతి, అమరావతి రాజధాని అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో హైదరాబాద్ నగరం ఏ విధంగానైతే అభివృద్ధి చెందిందో, అదే విధంగా రాబోయే రోజుల్లో మోదీ, బాబు నాయకత్వంలో అమరావతి కూడా ఒక ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

# వెలిగొండ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం.

### అదనపు బడ్జెట్ లో 905 కేటాయించిన చంద్రబాబు.

### నల్లమలసాగర్ నింపడమే లక్ష్యంగా వెలిగొండ పనులు.

### టన్నెల్స్ లో లైనింగ్, టిబిఎం తొలగింపు ముమ్మరం.

### క్షేత్రస్దాయిలో పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు.

మార్కాపురం జిల్లా-డోర్నాల.?ఈనెలలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందిస్తాం అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్ లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్ లో 905 కోట్లు కేటాయించాం అని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి డోర్నాల లో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్ళి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్ తొలగింపు పనులను క్షేత్ర స్దాయిలో పరిశీలించారు.వెలిగొండ ప్రాజెక్టు లో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్స్ పనులు పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్ లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాం అని, అదేవిధంగా టన్నెల్-1 లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలలో టన్నెల్-2లో 7 కి.మీ లైనింగ్ కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం అని, మిగిలిన 1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు.5 ఏళ్ళ వైసిపి పాలనలో హైకోర్టు ఆదేశాలతో టన్నెల్-2 లో చిక్కుకుపోయిన టన్నెల్ బోరింగ్ మెషిన్ వెలికితీత పనులు చేపట్టి, మొత్తం 7 కంపార్ట్మెంట్ లలో ఇప్పటికి 3 కంపార్ట్ మెంట్లు బయటకు తీసుకొచ్చాం అని టన్నెల్ బోరింగ్ మెషిన్ లో క్లిష్టమైన హెడ్ ను అక్కికక్కడే టన్నెల్ లోనే పూడ్చిపెట్టడానికి అవకాశాలు పరిశీలిస్తున్నాం అని పేర్కొన్నారు. ఫీడర్ కెనాల్ లో 5.3 కి.మీ రిటైనింగ్ వాల్ పనులు, జనవరిలో ప్రారంభించి నేటికి 5 నెలల్లో పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల, నత్తనడకన సాగుతున్న 21 కి.మీ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. మెంధా తుఫాన్ కారణంగా ఫీడర్ కెనాల్ లో పడిన భారీ గండికి సిసి వాల్ నిర్మించి పూర్తి చేయబోతున్నాం అని అన్నారు. తీగలేరు, ఈస్టర్న్ మెయిన్ కెనాల్స్ తో పాటు పర్మనెంట్ డైవర్షన్ రోడ్డు పనులు సైతం జూన్ నెలాఖరు నాటికి పూర్తికానున్నాయి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం, సీజన్ మొదలయ్యే నాటికి నల్లమలసాగర్ రిజర్వాయర్ నింపేలా పనులు జరుగుతున్నాయి అని తెలిపారు. వైసీపీ నాయకులు వెలిగొండ కు బడ్జెట్ లో నిధులు కేటాయించడం లేదు అంటూనే వెనుకబడిన ప్రకాశం జిల్లా ప్రజలకు తమ గొడ్డలి పార్టీ నాయకుడు చేసిన మోసాన్ని ఒప్పుకున్నారని అన్నారు. 5ఏళ్లలో నిర్వాసితులకు ఒక్క రూపాయి కూడా కేటాయించకుండా వారిని ఇబ్బంది పెట్టారని, కూటమి ప్రభుత్వం అదనపు బడ్జెట్ లో నిధులు కేటాయించి వారికి అండగా నిలబడ్డామని స్పష్టం చేశారు.

# అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి




కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాలు పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు,ఇందిరమ్మ ఇళు ,,పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. కొన్ని అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మరికొందరు ఆరోగ్య సమస్యలను డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి వారి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

# ఏపీలో ఎమ్మెల్యేల రౌడీ రాజ్యం నడుస్తోంది.

### ఎమ్మెల్యే తప్ప తాగి అర్ధరాత్రి భయభ్రాంతులకు గురిచేస్తున్న పట్టించుకోని చంద్రబాబు

### వైఎస్సార్సీపీ నేత మాజీ ఎమ్మెల్యే అబ్బాయి చౌదరి తీవ్ర విమర్శలు

తాడేపల్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు రౌడీల్లా ప్రవర్తిస్తూ సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఇటువంటి దుర్మార్గ పాలన గతంలో ఎప్పుడు చూడలేదని వైఎస్సార్సీపీ నేత అబ్బాయి చౌదరి మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో దెందులూరు ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని రౌడీలా ప్రవర్తించడం ఘోరమని ఆయన ఆరోపించారు.తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ (౹ఆఖ) లీగల్ సెల్కు చెందిన వైస్ ప్రెసిడెంట్, ఒక న్యాయవాది ఇంటిపై సిట్టింగ్ ఎమ్మెల్యే అర్ధరాత్రి పూట మద్యం మత్తులో జేసీబీతో దాడి చేశారని అబ్బాయి చౌదరి ఆరోపించారు. సదరు న్యాయవాదిని చంపాలనే ఉద్దేశంతోనే ఈ దాడి జరిగిందని, ఈ ఘటనతో ఏలూరు, నూజివీడు ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ ఎమ్మెల్యేపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కనీసం ఆయన అరాచకాన్ని అడ్డుకునే ప్రయత్నం కూడా ఎవరూ చేయలేదని విమర్శించారు.౧ "ఎమ్మెల్యే అయితే ప్రజాస్వామ్యానికి, చట్టానికి అతీతులా? కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలకు ఒక చట్టం, సామాన్యులకు ఒక చట్టం ఉందా?" అని అబ్బాయి చౌదరి.టీడీపీ కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో ఉంటారని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతుంటారని, మరి ఇప్పటికే 95 కి పైగా కేసులు ఉండి, రౌడీషీట్ కలిగిన ఎమ్మెల్యే ఈ రకంగా రెచ్చిపోతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ఘటనను చంద్రబాబు నాయుడు, నారా లోకేష్లు తీవ్రంగా ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే సదరు ఎమ్మెల్యేపై కఠిన చర్యలు తీసుకోకపోతే, సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నట్లు అవుతుందని ఆయన నిలదీశారు.

### కృష్ణ నది తీరాన " యోగాంధ్ర " కార్యక్రమం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆధ్వర్యంలో కృష్ణా నదీ తీరాన నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే, మనం చేసే పనిలో అంతటి అంకితభావం ఉంటుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్" కోసం అందరూ సహకరించాలి.వికసిత్ భారత్, విజన్ ఆంధ్రప్రదేశ్ 2047 వంటి లక్ష్యాలను సాధించాలంటే పౌరులందరూ ఆరోగ్యంగా ఉండటం అవసరం. ఈ యోగాసనాలు సరళంగా ఉండి ప్రతి ఒక్కరూ సులభంగా ప్రాక్టీస్ చేసేలా ఉంటాయి. రోజుకు 45 నిమిషాలు సమయం కేటాయిస్తే సరిపోతుంది. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ వి.యం.సి స్టేడియం, అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు.

# అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ.

**ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ.**

**అమ్మకు అక్షరమాలతో మహిళల్లో విద్యా చైతన్యం.**

**సేవా కార్యక్రమాలతో సమాజంలో వెలుగులు నింపాలి.**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

ములుగు జిల్లా. వెనుకబడిన, అటవీ ప్రాంత జిల్లాగా పేరుగాంచిన ములుగు జిల్లా విద్యా రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో,

రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు సైకిళ్లు తదితర సేవా కార్యక్రమాలతో సమాజానికి అండగా నిలుస్తున్న రోటరీ క్లబ్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మారుమూల గ్రామాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఈ సైకిళ్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో సేవా, సహాయ కార్యక్రమాలు, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దే కార్యక్రమాలు చేపట్టేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం రాష్ట్రంలో మహిళా అక్షరాస్యతకు కొత్త దిశానిర్దేశం చేస్తోందన్నారు. చదువురాని 12 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులను గుర్తించామని, మొదటి విడతగా 6 లక్షల మందికి లిటరసీ పరీక్షలు నిర్వహించగా 83.33 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమన్నారు. ఇప్పుడు మరో 6 లక్షల మందిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నామని, భవిష్యత్తులో వారందరినీ పదో తరగతి పరీక్షలకు కూడా సిద్ధం చేసే కార్యాచరణ చేపడుతున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో నిరక్షరాస్యత లేకుండా ప్రతి మహిళను అక్షరాస్యత వైపు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా కష్టపడి చదవాలని, విద్యను కేవలం బట్టీ పట్టే విధంగా కాకుండా ప్రతి సబ్జెక్టును లోతుగా అర్థం చేసుకుని నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం సంతోషకరమని అన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే విద్యా సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగుతామని తెలిపారు.

విద్యార్థులకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంటి వద్ద తల్లిదండ్రులు ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తే విద్యాభ్యాసంపై మరింత దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లాలో విద్యా అభివృద్ధికి సహకరించే సంస్థలు మరింత ముందుకు రావాలని కోరుతూ, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీకి ముందుకొచ్చిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,

వైస్ చైర్మన్ ఆసియా షాహిన్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీఐఈఓ వీరేంద్ర కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధులు చంద్రమౌళి, గణేష్, ఇతర సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత లేని వ్యక్తులకు ప్రోటోకాల్ మర్యాద



**రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధి ప్రజా బలం ప్రతినిధి 16 జూన్ 2026**ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఏ కార్యక్రమమైనా సాధారణంగా ప్రభుత్వ ప్రోటోకాల్ హోదా కలిగిన ప్రజా ప్రతినిధులను మాత్రమే ముఖ్య అతిథులుగా లేదా ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆహ్వానించడం ఆనవాయితీ మరియు నిబంధనలకు అనుగుణంగా జరుగుతుంది. అయితే ఈ మధ్య జరిగిన కార్యక్రమంలో ఎ రకమైన అర్హత లేని వ్యక్తులను అందల మెక్కిస్తూ, ప్రోటోకాల్‌కు పూర్తి విరుద్ధంగా మణికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యంత్రాంగం కార్యక్రమాలు నిర్వహించడం అత్యంత విచారకరం, ఈ విధానాన్ని స్థానిక బీ.ఆర్.ఎస్ తీవ్రంగా ఖండిస్తోంది. భవిష్యత్తులో కూడా ఇదే విధమైన వ్యవహారం కొనసాగితే సంబంధిత పై అధికారులకు ఫిర్యాదు చేస్తూ, అవసరమైతె విద్యాశాఖకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది, అట్టి పరిణామాలకు సంబందిత పాఠశాల అధికారులు పూర్తి బాద్యత వహించ వలసి వస్తుందని హెచ్చరిస్తున్నాము. అందువల్లన మణికొండ జెడ్పీ.హెచ్.ఎస్ పాఠశాల యాజమాన్యం ఇకపై ఇటువంటి చర్యలకు పాల్పడకుండా, ప్రభుత్వ నిబంధనలు మరియు ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటించాలని బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, జై రాం, షేక్ ఆరిఫ్, సుమనళిని, బొడ్డు శ్రీధర్ , చెరుకూరి బాలాజీ, బిందు, శ్రీకర తదితరులు డిమాండ్ చేస్తున్నాము. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని హితవు పలుకుతోన్నాము.

# టీ వై జె ఎఫ్ విజయం. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలంటూ విద్యాశాఖ ఆదేశాలు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్( టీ వై జె ఎఫ్ )నిరంతర కృషి ఫలితంగా సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించే దిశగా కీలక ముందడుగు పడింది. వివిధ జర్నలిస్టు సంఘాల వినతుల మేరకు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్. రోహిణి, జిల్లాలోని ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాలకు ప్రత్యేక లేఖ జారీ చేశారు,జర్నలిస్టుల పిల్లలకు సాధ్యమైనంత మేర ఉచిత విద్య అందించాలని పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలను కోరారు. జర్నలిస్టుసమాజానికి ప్రోత్సాహకంగా ఈ చర్యలు చేపట్టినట్లుపేర్కొన్నారు.ఈసందర్భంగా టీ వై జె ఎఫ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, విద్యాశాఖకు కృతజ్ఞతలు తెలిపారు, జర్నలిస్టుల సంక్షేమం కోసం టీ వై జె ఎఫ్,ఎల్లప్పుడూ కృషిచేస్తుందని వారుపేర్కొన్నారు.జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని టీ వై జె ఎఫ్ నాయకులు కోరారు.

# మీ బ్యాంక్ ఖాతాకు 'నామినీ' ఉన్నారా మీ కుటుంబ ఆర్థిక భద్రత మీ చేతుల్లోనే





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**ఆర్థిక క్రమశిక్షణ అంటే కేవలం డబ్బు దాచుకోవడం మాత్రమే కాదు, ఆ డబ్బు మన తర్వాత మన కుటుంబానికి సులభంగా అందేలా చూడటం కూడా, అందుకే ఆర్.బి.ఐ ఇప్పుడు నామినేషన్ ప్రక్రియను మరింత సరళతరం మరియు తప్పనిసరి చేసింది,ముఖ్యమైన ఆర్ బి ఐ అప్‌డేట్స్ (2025--26)నలుగురు నామినీలు,ఇప్పుడు ఒకే ఖాతాకు గరిష్టంగా నలుగురు (4) నామినీలను నియమించుకోవచ్చు, (గతంలో ఒకరికే మాత్రమే అవకాశం ఉండేది.)వాటా నిర్ణయం (షేర్%):నలుగురు నామినీలకు ఎంత శాతం చొప్పున వాటా ఇవ్వాలనేది మీరు నిర్ణయించుకోవచ్చు,ఈ విషయాన్ని ధన్ ఫౌండేషన్ (సీఫ్ ల్) కోఆర్డినేటర్ సంపూర్ణ మేడమ్, మరియు అసోసియేట్ స్వప్న, తెలియజేశారు

# ములుగు డివిజన్‌లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనం ప్రారంభం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 16** ములుగు విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో మంజూరైన ఇసుజు డి-మ్యాక్స్ ఎస్-క్యాబ్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్‌టీ) వాహనాన్ని ములుగు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. భిక్షపతి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయాలు, బ్రేక్‌డౌన్ పరిస్థితులు, నిర్వహణ పనులు, దెబ్బతిన్న డీటీఆర్‌ల తరలింపు, వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కారం వంటి అత్యవసర సేవలను మరింత వేగంగా అందించేందుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు.ములుగు డివిజన్ పరిధిలోని మారుమూల ప్రాంతాల్లో కూడా విద్యుత్ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించి వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఈ వాహనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, వినియోగదారుల సంతృప్తిని పెంపొందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పి. నాగేశ్వరరావు డివిజనల్ ఇంజనీర్, ఎన్. వేణుగోపాల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, మహేందర్ ఏఈ కమర్షియల్, కృష్ణారావు ఏఈ టెక్నికల్తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# చోరీ కేసులో నేరస్తుడి అరెస్ట్



**జహీరాబాద్, జూన్ 16 ప్రజాబలం ప్రతినిధి:** న్యాల్కల్ మండలం గణేష్ పూర్ గ్రామంలో ఒంటరి మహిళలను టార్గెట్ చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. గత నెల 12న గణేష్ పూర్ గ్రామ శివారులో చేనులో పనిచేస్తున్న ఒంటరి మహిళ వద్ద ఇద్దరు దుండగులు వచ్చి చైన్ స్నాచింగ్ కు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించామన్నారు. మంగళవారం గంగ్వార్ కూడలి వద్ద వాహనాల తనిఖీ చేపట్టి నిందితుడిని అరెస్టు చేయగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద ఐదు గ్రాముల బంగారం, రెండు బంగారం రింగులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇదే కేసులో మరో నిందితుడిని ముందే అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

# ఆత్మ ములుగు జిల్లా చైర్మన్ గా చిటమట రఘు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 16** ములుగు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు అందే విధంగా రైతులకు ప్రభుత్వం నుంచి పథకాలు రైతులకు కావలసిన ఎరువులు నీటి సదుపాయాలు పనిముట్లు సంబంధిత రైతులకు కావలసిన అన్ని సదుపాయాలు చేకూర్చే విధంగా నాపై నమ్మకం ఉంచి పంచాయతీ రాజ్ మినిస్టర్ మంత్రి సీతక్క చైర్మన్ గా నాకు అవకాశం ఇచ్చినందుకు మంత్రి గారికి జిల్లా నాయకులకు రైతులకు కాంగ్రెస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అలాగే రైతులకు ఏలాంటి సమస్యలు వచ్చిన ఆ సమస్యలను మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అందరికీ తెలియజేస్తున్నాను

## జూన్ 17న జరిగే మెగా జాబ్ మేళా నిర్వహణకు సమన్వయంతో పనిచేయాలి

### :: జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి జూన్ 16 ములుగు** ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17వ తేదీ బుధవారం ఇంచర్లలోని ఎం.ఆర్. గార్డెన్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా--2026 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ఐపీఎస్‌తో కలిసి ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో తాగునీరు, భోజనం, కూర్చునే వసతి, పార్కింగ్, షేడ్ తదితర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ మెగా జాబ్ మేళాలో విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నందున కంపెనీల వారీగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు సులభంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.
జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, సీఐ దయాకర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ చేపల చెరువుల కూల్చివేత.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూన్ – 16, ప్రజాబలం ప్రతినిధి** :?జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ చేపల చెరువులను అధికారులు కూల్చివేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ?ఈ కూల్చివేతల ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 అక్రమ చేపల చెరువులను తొలగించడం జరిగింది. ఇందులో ముర్మూర్ గ్రామంలో 17, సోమన్‌పల్లి గ్రామంలో 2, పొట్యాల గ్రామంలో 2, ఎల్లంపల్లి గ్రామంలో 1 చొప్పున అక్రమ చెరువులను గుర్తించి తొలగించామని, ఈ చర్య ద్వారా గత 6 సంవత్సరాలుగా ఆక్రమణకు గురైన సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ?ఈ కూల్చివేత ప్రక్రియలో నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, మత్స్య శాఖల అధికారులు సమన్వయంతో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ఆక్రమిస్తే, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



## హాస్పిటల్ వర్కర్స్ కు కనీస వేతనాలు 26వేలకు పెంచాలి

### -CITU జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్



**జహీరాబాద్, జూన్ 16 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు 26 వేల వరకు ఇవ్వాలని, ప్రతినెలా వచ్చే వేతనాలు ఏడవ తేదీలోపు చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపర్డెంట్ ను వర్కర్లతో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ ధరలను పెరుగుదలను పట్టించుకోకుండా వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైందింకాదని, పెరిగిన ధరలతో వేతనాలు పెరగక కార్మికులు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలకు పెంచాలని ఏడో తేదీలోపువేతలు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు. హాస్పిటల్లో నెలకొన్న వైద్యుల కొరతను తీర్చి రోగులకు వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు హాస్పిటల్ వర్కర్స్ జహీరాబాద్ హాస్పిటల్ యూనియన్ అధ్యక్షుడు బండి సుధాకర్ నాయకులు పవన్ ఇతరులు పాల్గొన్నారు.

## మా భూములకు రక్షణ కల్పించండి

## బీసీ జేఏసీ భారీ ర్యాలీ

### రైతుల పంట పొలాలను కబ్జా చేసిన గిరిజనులు






**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 16**ఉద్యమించిన ఏటూరు నాగారం గిరిజనేతరులుఆపడానికి ప్రయత్నించిన ఏ ఎస్పీ రెండు గంటల పాటు తీవ్ర ఉద్రిక్తత 144 145 సెక్షన్లను అమలు చేసిన తహసిల్దార్ నవతెలంగాణ ఏటూరు నాగారం ఐటిడిఏ ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి ఘనపూర్ ప్రాంతంలో గల 209 సర్వే నెంబర్ లో గల 120 ఎకరాల భూమిని స్థానికేతర గిరిజనులు ఆక్రమించుకోవడంతో భూ వివాదం రచ్చకెక్కింది స్థానిక గిరిజనేతరులు ఒక్కసారిగా ఉద్యమించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది సుమారు రెండు గంటల పాటు పోలీసులు స్థానికుల మధ్య తోపులాట జరిగి చివరికి 144 సెక్షన్ అమలుకు దారి తీసింది పంట పొలాలను అసరాగా చేసుకుని పూర్వం నుండి స్థానిక గిరిజనేతర రైతులు జీవిస్తున్నారు. రెండు రోజుల క్రితం వాజేడు వెంకటాపురం మండలాలకు చెందిన గిరిజన కుటుంబాలు ఏటూరు నాగారం లోని అవినీతికి పాల్పడుతున్న కొంతమంది గిరిజనులతో చేతులు కలిపి ఈ 120 ఎకరాలను రాత్రికి రాత్రి ఆక్రమించుకున్నారు రాత్రి పగలు అక్కడే ఉంటున్నారు విషయం తెలుసుకున్న స్థానిక రైతులు సంఘటన స్థలానికి వెళ్లి ఈ పోలాలు మావని పూర్వం నుండి సాగు చేసుకుని జీవిస్తున్నామని కాళ్ల వెళ్ళపడి మొరపెట్టుకున్న గిరిజనులు వినలేదు దాంతో దిక్కుతోచని రైతులు పోలీసులను ఆశ్రయించారు స్పందించిన ఎస్సై మహేష్ సంఘటన స్థలానికి వెళ్లి ఎలాంటి ఆధారాలతో స్థలాలు ఆక్రమించుకున్నారని ప్రశ్నించారు మాకు ఆధారాలు లేవని చట్టాలు ఉన్నాయని మాకు ఎక్కడైనా స్థలం ఆక్రమించుకోవడం ఇల్లు నిర్మించుకునే హక్కులు ఉన్నాయని గిరిజన మహిళలు ఎస్సై వాదించారు ఎలాంటి ఆధారాలు లేకుండా భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై మహేష్ వారికి హెచ్చరించారు అయిన వినని గిరిజనులు పొలాలను ఎవరికివారు హద్దులు ఏర్పాటు చేసుకొని గుడిసెలు వేసుకోవడానికి సిద్ధమవుతున్నారు ఈ క్రమంలో రైతులు వ్యాపారస్తులు మహిళలు పార్టీలకు అతీతంగా ప్రజాప్రతితులు పెద్ద ఎత్తున ఉద్యమించారు శాంతియుత ర్యాలీతో ఐటీడీఏ వరకు వెళ్లడానికి ప్రయత్నించారు
ఈ క్రమంలో ఏఎస్పీ మనన్ బట్ ఐదు మండలాల ఎస్సై సీఐ లకు సమాచారం ఇచ్చి పోలీసు బలగాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు అయినా ఉద్యమం ఆగలేదు వైజంక్షన్ వద్ద గిరిజనేతరులు పోలీసుల మధ్య తోపులాట జరిగింది తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది లా అండ్ ఆర్డర్ చెయిా దాటిపోయే ప్రమాదం ఉందని గమనించిన ఎ.ఎస్.పి చట్టాన్ని మీ చేతిలోకి తీసుకోవద్దని వారికి నచ్చ చెప్పారు గిరిజనులను పొలాల నుండి కాళీ చేపించాలని లేనట్లయితే మేము దేనికైనా తెగిస్తామని కొద్దిసేపు ధర్నా నిర్వహించారు
ఏ ఎస్పి ఆదేశంతో ఎస్ఐ మహేష్ తాసిల్దార్ కు సెక్షన్ లను అమలు చేయాల్సిందిగా కోరారు దాంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మార్వో జగదీష్ 144 145 163 164 సెక్షన్ లను అమలు చేస్తున్నట్లు తెలిపారు భూముల్లో నుండి గిరిజనులను వెళ్ళగొట్టిస్తామని మీ పొలాలను మీకు అప్పజెప్తామని తాసిల్దార్ స్థానికులకు హామీ ఇచ్చారు గిరిజనులను పొలాలలో నుండి వెళ్లగొట్టడానికిపోలీస్ రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా కృషి చేస్తుంది ఈ ఉద్యమంలో స్థానిక ప్రజలు జేఏసీ నాయకులు వ్యాపారస్తులు రైతులు మహిళలు పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

## విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసలు,విద్యా ఉప కరణలు పంపిణీ ..





నాగర్ కర్నూల్ పట్టణంలోని ఎర్రగడ్డ లో గల సుబ్రహ్మణ్యస్వామి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నాడు విద్యార్థులకు సామూహిక అక్షర అభ్యాసాలు వేదమంత్రచరణల మధ్య శ్రీ శనేశ్వర దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి నిర్వహించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి చేరుకోవాలని వేద ఆశీర్వచనం చేశారు.నేటి విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం కూడిన విజ్ఞాన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు,పెన్నులు,పెన్సిల్, విద్య ఉపకరణాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల దేవి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి,బాలకృష్ణ, కిషోర్ గౌడ్,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో అవినీతి డిప్యూటీ తాసిల్దార్

బద్వేలు తాసిల్దార్ కార్యాలయం అవినీతి లంచాలతో మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి ముఖ్యంగా అక్కడ పనిచేస్తున్న డిప్యూటీ తాసిల్దార్ భారీ అవినీతికి పాల్పడుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు ప్రధానంగా వాస్తవ ( జినైన్ ) సర్టిఫికెట్ల కోసం అక్కడ పనిచేస్తున్న డిప్యూటీ శాసిల్దార్ భారీ ఎత్తున ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి బాధితులు కూడా ఇదే ఆరోపణలు చేస్తున్నారు మంగళవారం ఉదయం కూడా బద్వేలు ఆర్డిఓ కార్యాలయం వద్ద డిప్యూటీ తాసిల్దార్ తో బాధితులు ఘర్షణ పడ్డారు తీసుకున్న డబ్బు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు

## అమర్నాథ్ గౌడ్‌కు నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు పట్టణంలో బాపట్ల జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ దారుణ హత్యకు గురై జూన్ 16 నాటికి మూడు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అమర్నాథ్ గౌడ్ ఘటన రాష్ట్ర రాజకీయ చరిత్రలో మరచిపోలేని విషాదకర సంఘటనగా నిలిచిపోయిందన్నారు. పదో తరగతి చదువుతున్న అమాయక విద్యార్థిని పెట్రోల్ పోసి సజీవదహనం చేయడం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.అమర్నాథ్ గౌడ్ కుటుంబం ఇప్పటికీ ఆ బాధ నుంచి కోలుకోలేకపోతుంటే, ఆ ఘటనకు బాధ్యులైన వారు ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా వ్యవహరించడం మరింత బాధాకరమని అన్నారు. ఇలాంటి అమానుష ఘటనలు సమాజానికి చెడు సంకేతాలని, ప్రజాస్వామ్యంలో హింసకు ఎలాంటి స్థానం లేదని పేర్కొన్నారు.అమర్నాథ్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్, మార్కెట్ యార్డు చైర్మన్, స్థానిక నాయకులు, బీజేపీ మరియు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ బీదర్ రోడ్డుపై గ్రామస్తుల ధర్నా



**జహీరాబాద్, జూన్ 16 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ – బీదర్ రహదారి గుంతల మయంగా మారడంతో ప్రమాదాలు చేసుకుంటూ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ రేజింతల్ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఖలీల్ పూర్ వద్ద మొన్న జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం



చేశారు. ఆందోళనలో పాల్గొన్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం మాట్లాడుతూ జహీరాబాద్ బీదర్ రహదారి గుంతలు మయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారిందన్నారు. గుంతలు రోడ్డుతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురై మరణించడంతోపాటు పాలవుతున్నారన్నారు. రోడ్డు బాగు చేయాలని అధికారులకు నాయకులకు ఎన్ని మార్లు విన్నవించిన స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆర్ అండ్ బి అధికారులను పిలిచి మాట్లాడారు. త్వరలోనే రోడ్డును బాగు చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గుంజేట్టి సర్పంచ్ దేశెట్టి పాటిల్, నాయకులు గోపాల్ విఠల్ రెడ్డి అర్జున్, దేవప్ప, శ్రీనివాస్, ఫిరోజ్, షాకీర్, నజీర్, ఆరిఫ్, మేఘనాథ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## హాస్పిటల్ వర్కర్స్ కు కనీస వేతనాలు 26వేలకు పెంచాలి



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి జూన్ 16** ఏటూరు నాగారం సామాజిక వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న పని చేసే కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు 26 వేల వరకు ఇవ్వాలని, ప్రతినెలా వచ్చే వేతనాలు ఏడవ తేదీలోపు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో ఏటూరు నాగారం సామాజిక వైద్యశాల సూపరిండెంట్




డాక్టర్ సురేష్ కుమార్ గారికి వైద్యశాల సిబ్బందితో కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ధరలను పెరుగుదలను పట్టించుకోకుండా వేతనాలు పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైందింకాదని, పెరిగిన ధరలతో వేతనాలు పెరగక కార్మికులు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలకు పెంచాలని ఏడో తేదీలోపువేతలు ఇవ్వాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ ఏఎన్ఎం జిఎన్ఎమ్ సెక్యూరిటీ గార్డ్స్ శానిటేషన్ రీసెంట్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు

## మియాపూర్ మంగళ వారం మార్కెట్ ను యధావిధి గా నిర్వహించాలి!!!
## ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి.



**మియాపూర్( ప్రజాబలం ప్రతినిధి నరేష్) జూన్ 16**మియాపూర్ డివిజన్, న్యూ కాలనీ శివాలయం ఎదురుగా ఉన్న గ్రౌండ్ వద్ద ప్రతి మంగళవారం నిర్వహించే మార్కెట్ స్ట్రీట్ వెండర్స్ ను అడ్డుకున్న సిఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, మార్కెట్ ప్రాంతానికి చేరుకుని సీఆర్పీఎఫ్ కేంద్ర అధికారులతో మాట్లాడి స్ట్రీట్ వెండర్స్ సమస్య పరిష్కరించిన చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్.మియాపూర్ డివిజన్, న్యూ కాలనీ శివాలయం వద్ద ఉన్న గ్రౌండ్ లో గత 20 సంవత్సరాలు గా ప్రతి మంగళవారం కురాగాయలు , పండ్లు, చిన్న వ్యాపారాలతో బ్రతుకుతున్న స్ట్రీట్ వెండర్స్ ను షాప్ పెట్టనీయకుండా సి.ఆర్.పీ.ఎఫ్ వారు, స్థానిక పోలీసులు అడ్డుకుంటున్నారని తెలియగా వెళ్లి స్ట్రీట్ వెండర్స్ మాట్లాడి సమస్యను తెలుసుకుని సీఆర్పీఎఫ్ కేంద్ర అధికారులతో మాట్లాడి ప్రతి మంగళవారం వారి వ్యాపారాలు అక్కడే జరుపుకునేలా చర్యలు తీసుకున్న చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఇదే ప్రాంతంలో ప్రతి మంగళవారం స్ట్రీట్ వెండర్స్ మార్కెట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహించకుంటూ బ్రతుకుతున్నారని, వారు ప్రతి రోజు వేరే వేరే ప్రాంతాలలో మార్కెట్ ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారని,ఇక్కడ వ్యాపారాలు నిర్వహించే అందరూ పేదవారని వీళ్ళను అడ్డుకున్న వాళ్ళు మొన్న రేవంత్ రెడ్డి మీటింగ్ కు ఏ విధంగా అనుమతించారని ప్రశ్నించారు, సంబంధిత అధికారులతో మాట్లాడి ఇదే ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించే విధంగా అనుమతులు ఇప్పించడం జరిగింది, ఈ విషయమై మార్కెట్ వ్యాపారులు ఎంపీ కి , రవికుమార్ యాదవ్ కి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బి ఎస్ ఎన్ కిషోర్ యాదవ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్ ముదిరాజ్ , గణేష్ ముదిరాజ్ , పట్టాభిరామ్, పవన్, విజయేందర్, శ్రీనివాస్ ,రాము, బసవ శివ, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంది..సత్యం శ్రీరంగం

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా పేద బ్రాహ్మణులను ఆదుకుంటాం - ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్...

**కూకట్పల్లి (ప్రజాబలం )జూన్ 16:** తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ వారిని ఆత్మీయంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించడం జరిగింది. బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం



తీసుకుంటున్న సంక్షేమ కార్యక్రమాలు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలు చేస్తున్నపథకాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సహాయక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా, బ్రాహ్మణ సమాజ సంక్షేమం సాధికారతలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పొన్నాడ సుబ్రమణ్య ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు తమ సమస్యలను వినతి పత్రం ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్య మని, బ్రాహ్మణుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరేలా చర్యలు తీసుకుంటామని, ఆయన మార్గదర్శకత్వంలో పరిషత్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని నాకు నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్ర ఆచార్య, హరి హర క్షేత్రం చైర్మన్ మూర్తి, సుబ్బారావు, పంచగంగేశ్వర్, శ్రీరంగం శ్రీనివాస చార్యులు, కొండపాక కృష్ణమాచార్యులు, శ్రీరంగం శేషాచార్యులు, కాండూరి మోహన్, శ్రీరంగం కృష్ణమాచార్యులు, శ్రీరంగం మోహన్, అభినయ్, చక్ర పాణి, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రెడీమిక్స్ లారీ డ్రైవర్‌కు రావలసిన వేతనం ఇప్పించిన.. రవి సింగ్



**కూకట్పల్లి (ప్రజాబలం ) జూన్ 16:** శంషాబాద్ ఏరియాలోని "కే ఎన్ ఆర్ రెడీవిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ" లో లారీ డ్రైవర్ గా సోను అనే డ్రైవర్ గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు డిసెంబర్ నెల రావాల్సిన వేతనం 27,000 వేల రూపాయలు అతను ఎంత అడిగినా ఏదో ఒకటి చెప్పి అతనికి డబ్బులు ఇవ్వకుండా మాయమాటలు ఓనర్ నవీన్ రెడ్డి చెప్పి పంపించేవారు అతనికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారని తోటి డ్రైవర్లను అడిగి తెలుసుకుని శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి కార్యాలయం దగ్గరికి వెళ్లి అతనికి జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నారు వెంటనే స్పందించిన శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి హుటాహుటిన. కేఎన్ఆర్ రెడీమిక్స్ యజమాన్యం ఓనర్ నవీన్ రెడ్డి తో మాట్లాడి డ్రైవర్ సోనుకు రావాల్సిన 27,000 రూపాయల వేతనం మొత్తం సోను కు ఇప్పించారు కార్మికుల పక్షాన నిలిచి సమస్య పరిష్కరించిన రవి ని సోను అతని కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, నర్సింగ్, సిపిఐ చారి, తల్వార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి బర్త్ డే కార్యక్రమంలో పాల్గొన్న మర్పల్లి మండల ప్రెసిడెంట్ సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 16 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి బర్త్ డే కార్యక్రమంలో పాల్గొన్న మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ యాదవ్ మర్పల్లి నాయకులతో కలిసి బర్తే కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి అన్న ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఇంకా అనేక ఉన్నతమైన పదవులు ఆస్వాదిస్తూ ప్రజలకు సేవ చేసే భాగ్యం కలగాలని దేవుడు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజాసేవలో నిండు నూరేళ్లు సంతోషంగా ప్రజాసేవలో ఉండాలని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు బర్తే కార్యక్రమంలో మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సురేష్ యాదవ్, అత్యధిక మెజార్టీతో ప్రజా సేవకుడు డైన యువ నాయకుడు నందు ప్రకాష్, మాజీ సర్పంచ్ ధరమ్ సింగ్ మరుపల్లి మండల నాయకులు బర్తే కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు

## జూన్ 21 నీట్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జూన్ 16:**జూన్ 21 న జరుగనున్న నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైనారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 311 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందుబాటులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డిఓలు వెంకట్ రెడ్డ, శ్యాంప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com